ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు

5

శుక్రవారం 10 మే 2024





ఇటీవల ఈపూరులో టీడీపీ కార్యకర్తకు చెందిన కారు తగులబెట్టిన వైసీపీ శ్రేణులు

బరితెగిస్తున్నారు..

- యథేచ్ఛగా దాడులు, దౌర్జన్యాలు
- అసహనంతో తెగబడుతున్న వైసీపీ
- పోలింగ్ సమీపిస్తోన్నా ఆగని అరాచకాలు



గురజాల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న లక్ష్మీనారాయణ

(నరసరావుపేట - ఆంధ్రజ్యోతి/ గురజాలటౌన్)

పోలింగ్ సమయం సమీపిస్తోంది. ప్రచారాలకు కేవలం రెండు రోజులే గడువు. నామినేషన్ల ఘట్టం ముగిసిన తర్వాత ఆయా నియోజకవర్గాల్లో వైసీపీ పరిస్థితి మరింత దిగజారింది. ఓ వైపు ప్రజల్లో కానరాని స్పందన, మరో వైపు ద్వితీయశ్రేణి నేతలు టీడీపీ బాట పడుతుండటంతో వైసీపీ అభ్యర్థుల్లో అసహనం పతాక స్థాయికి చేరింది. దీంతో టీడీపీ శ్రేణుల మీద దాడులకు తెగబడుతున్నారు. సామాజిక వర్గాలను కించపరిచే విధంగా దుర్భాషలాడుతున్నారు. పలు చోట్ల దుశ్చర్యలకు కూడా బరితెగిస్తున్నారు. దాడులు, దౌర్జనాలు, అరాచకాలతో అటు కూటమి శ్రేణుల్లో, ఇటు ఓటర్లలో భయాందోళలు సృష్టించాలన్న కుట్రలో భాగంగానే గత కొన్ని రోజులుగా జరుగుతున్న ఘటనలన్న అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. భారీగా పోలీసులు, కేంద్ర బలగాలు మోహరించినా.. పోలీసు అధికారులు హెచ్చరికలు చేస్తున్నా వారం రోజుల నుంచి జిల్లాలో దాడుల పరంపర పెరిగిపోయింది. రెండు రోజుల్లోనే పల్నాడు జిల్లాలో దాదాపు పది సంఘటనలు నమోదయ్యాయి. పలు నియోజకవర్గాల్లో హోం ఓటింగ్ సమయంలో అధికారుల సమక్షంలోనే వైసీపీ మూకలు బరితెగించాయి. ముపాళ్ల మండలం మాదల, వెల్దుర్తి మండలం శిరిగిరిపాడులో జరిగిన ఘర్షణల్లో టీడీపీ వర్గీయులు పలువురు గాయపడ్డారు. పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్‌ల్లోనే పెద్దఎత్తున ఘర్షణలు జరగడంతో సోమవారం జరిగే అసలు పోలింగ్ రోజు పరిస్థితులు ఎలా ఉంటాయోనన్న ఆందోళనలో ఓటర్లున్నారు.

కోడ్ వచ్చినప్పటి నుంచి..

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత జిల్లాలోని దాదాపు అన్ని నియోజకవర్గాల్లో దాడులు, ఘర్షణలు జరిగాయి. టీడీపీ ఎన్నికల ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొంటున్న నాయకులు, అభిమానులే లక్ష్యంగా వైసీపీ మూకలు దాడులకు తెగబడుతున్నాయి. వైసీపీ వ్యూహాత్మకంగా దాడులకు తెగబడుతున్నదన్న ఆరోపణలున్నాయి. పోలింగ్ రోజున పోలింగ్ బూత్‌లను స్వాధీనం చేసుకుని ఏకపక్షంగా ఎన్నికల నిర్వహించుకోవాలని వైసీపీ అభ్యర్థులు పలుచోట్ల ప్రయత్నాలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ముందస్తుగా దాడులతో భయపెడితే పోలింగ్ రోజున టీడీపీ సానుభూతిపరులను ఓటింగ్‌కు రాకుండా అడ్డుకోవచ్చన్న వ్యూహంలో భాగమే జరుగుతున్న దాడులు అన్న వాదన ఉంది.

తీరు మారని పోలీసులు

అధికార పార్టీకి అండగా ఉన్న పోలీసు అధికారులను మార్చినా కిందిస్థాయి అధికారుల్లో మార్పు కనిపించడం లేదని తాజా ఘటనలే నిదర్శనం. నియోజకవర్గ స్థాయిలో పోలీస్ అధికారులు తీరు మార్చుకోలేదన్న విమర్శలున్నాయి. ఇంకా పలు ప్రాంతాల్లో పోలీసులు వైసీపీకే కొమ్ముకాస్తున్నారన్న ఆరోపణలున్నాయి. దీంతోనే వైసీపీ మూకలు బరితెగిస్తున్నాయన్న విమర్శలున్నాయి. పోలీసు అధికారులు సరైన రీతిలో చర్యలు తీసుకోకుండా వైసీపీ నేతలకు అండగా ఉండటం వల్లే దాడుల పరంపర కొనసాగుతున్నందన్న ఆరోపణలున్నాయి. నియోజకవర్గ స్థాయిలో పోలీస్ అధికారులు చిత్తశుద్ధితో పని చేయకపోతే ప్రశాంత ఎన్నికలు అనుమానమేనని చెప్పవచ్చు. ఎస్పీ బిందుమాధవ్ ప్రశాంత ఎన్నికలకు చర్యలు తీసుకుంటున్నా నియోజకవర్గ స్థాయి అధికారులు నీరుగారుస్తున్నారన్న విమర్శలున్నాయి.

తాజాగా చర్లగుడిపాడులో..

చర్లగుడిపాడుకి చెందిన టీడీపీ కార్యకర్త పోట్ల లక్ష్మీనారాయణ కూటమి అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా ప్రచారంలో పాల్గొంటున్నారు. దీంతో వైసీపీ నేతలు లక్ష్మీనారాయణపై కక్ష కట్టారు. లక్ష్మీనారాయణ ఇంటి ముందు ఉన్న రైసు మిల్లు వద్ద బుధవారం రాత్రి వరకు వైసీపీ మూకలు మద్యం తాగుతూ ఈలలు, గోలలు, కేకలు వేస్తూ కవ్వింపునకు దిగారు. అర్ధరాత్రి ఒంటిగంట దాటుతున్నా వారి ఆగడాలు ఆగక పోవడంతో విసిగిపోయిన లక్ష్మీనారాయణ వారి వద్దకు వెళ్లి మా ఇంటి ఎదురుగా ఎందుకు ఇలా చేస్తున్నారని మందలించే ప్రయత్నం చేశారు. వెంటనే తమతో తెచ్చుకున్న ఇనుపరాడ్లతో లక్ష్మీనారాయణ తలపై మోదారు. గమనించిన బంధువులు అక్కడకు చేరుకుంటుండగా వైసీపీ మూకలు పరారయ్యాయి. తీవ్రంగా గాయపడిన లక్ష్మీనారాయణను గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం నరసరావుపేటకు తరలించారు. దాడికి సంబంధించి కావూరి అంజిబాబు, బండారు అలేఖ్య, వేముల కృష్ణారావు, పేరయ్యలపై బాధిత కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

కవ్వించి.. దాడి..

పల్నాడు ప్రాంతంలో టీడీపీ శ్రేణులను కవ్వించి ఆ తర్వాత వారిపై దాడి చేసి ఆ ప్రాంత ప్రజల్లో వైసీపీ భయాందోళనలను సృష్టిస్తోంది. మంగళవారం రాత్రి వెల్దుర్తి మండలం బైదలో ఇలాగే జరగ్గా తాజాగా గురజాల మండలం చర్లగుడిపాడులో చోటుచేసుకుంది. ఎన్నికల ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొంటున్న టీడీపీ నేతలను వైసీపీ మూకలు టార్గెట్ చేస్తున్నాయి. ఆ తర్వాత దాడి చేయాల్సిన వ్యక్తిని ఎంచుకుని అతడి ఇంటి ఎదురుగా మద్యం తాగడం.. ఈలలు వేయడం.. నినాదాలు చేసి కవ్విస్తారు. ఇదేమని ప్రశ్నించగానే తమ వెంట తెచ్చుకున్న ఇనుపరాడ్లతో దాడి చేయడం పరిపాటిగా మారింది. కూటమి తరఫున ఎవరూ ప్రచారంలో పాల్గొనకుండా భయభ్రాంతులకు గురి చేయాలనే కుట్రలో వైసీపీ మూకలు బరితెగిస్తున్నట్లు ఆయా ఘటనలు చూస్తే అర్థమవుతోంది. వీరికి కొందరు పోలీసులు పూర్తిగా సహకరిస్తున్నారని అందువల్లే వారు చెలరేగిపోతున్నట్లు ఆరోపణలున్నాయి.

మందు పోస్తున్నారు..



- ఏరులైపారుతున్న మద్యం
- ఎక్కడికక్కడ జోరుగా పంపిణీ
- ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా సరఫరా
- గ్రామాలు, పట్టణాల్లో పంపిణీకి ప్రత్యేక ఏర్పాట్లు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఖర్చు రూ.50 కోట్ల పైమాటే

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎన్నికలు అంటేనే మందుబాబులకు పండుగ. చుక్క పడనిదే ప్రచారాలు జరగవు.. ప్రచారాల్లో సందడి ఉండదు. పోలింగ్ తేదీ సమీపిస్తోన్న కొద్దీ మద్యం పంపిణీ ముఖ్యమవుతోంది. ఎన్నికలంటేనే మద్యం పంపిణీ ఆనవాయితీగా మారింది. ప్రధాన పార్టీల అభ్యర్థులు మద్యం పంపిణీలో పోటీ పడుతుంటారంటే దానికి ఎంతటి ప్రాధాన్యం ఉందో అర్థమవుతోంది. మద్యం ఇవ్వకపోతే ఎక్కడ తనకు నష్టం జరుగుతుందోనని అభ్యర్థులు భావిస్తుంటారు. మద్యం ఎటు వైపు ఎక్కువగా పంపిణీ చేస్తే అటు వైపు కార్యకర్తలు, నేత లు హడావుడి ఉంటుంది. మద్యం పంపిణీ చేయకపోతే ఆ అభ్యర్థి డబ్బు తీయడంలేదన్న ప్రచారం కూడా చేస్తారు. దీంతో ఎన్నికల ప్రక్రియలో ఎక్కడ వెనుకపడతామోనన్న భయంతో ప్రధాన పార్టీలకు మద్యం పంపిణీ తప్పనిసరైంది. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ తేదీ సమీపిస్తున్న కొద్దీ ఉమ్మడి గుంటూరు జిల్లాలో జోరుగా మద్యం పంపిణీ జరుగుతోంది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో మద్యం ఖర్చు రూ.50 కోట్లు పైమాటే అని సమాచారం. ఈ సారి ఎన్నికల నిబంధనల్లో మద్యంపై పటిష్ఠ నిఘా పెట్టారు. గతంలో ప్రైవేటు దుకాణాల్లో ఎంతమేర అవసరమైతే అంత స్టాకును ముందుగానే తెచ్చుకునే వారు. అయితే ఈ సారి మద్యం కేవలం ప్రభుత్వ దుకాణాల్లో అందుబాటులో ఉండటం.. అక్కడ విక్రయాలపై నిఘా పెట్టారు. దీంతో అభ్యర్థులు ముందుగానే మద్యం ఏర్పాట్లు చేసుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఎక్కడికక్కడ మద్యం పంపిణీకి ఏర్పాట్లు జరిగాయని సమాచారం. ఉమ్మడి గుంటూరు జిల్లాలో రూ4.5 కోట్ల నుంచి 5 కోట్ల వరకు కేవలం మద్యానికే అభ్య ర్థులు ఖర్చు చేస్తున్నట్లు పార్టీ వర్గాల లెక్కలు తెలియ జేస్తున్నాయి. ఐదు రోజులుగా మద్యం పంపిణీ ఊపందు కుంది. ప్రతి రోజు పట్టణాల్లో వార్డులు, గ్రామాల వారీగా మద్యం పంపిణీ జరుగుతోంది. గ్రామాలు, వార్డుల్లో పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేసి అక్కడి నుంచి రాత్రి వేళ మద్యం పంపిణీ చేస్తున్నారు. ఓటర్ల సంఖ్య ఆధారంగా మద్యం సరఫరా జరుగుతోంది. వార్డులకు 4 నుంచి 9 కేసుల వరకు మద్యం కేటాయిస్తున్నట్లు సమాచారం. గ్రామాల్లో ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా మద్యం కేసులు అందు తున్నాయి. క్వార్టర్ రూ.150 నుంచి రూ.250 ధర ఉన్న మద్యంను పంపిణీ చేస్తున్నారు. ఓటర్ల స్థాయిని బట్టి మద్యం బ్రాండ్‌లు మారుతున్నాయి. కొన్ని చోట్ల నేరుగా మద్యం కేసులను పంపిణీ చేస్తున్నారు. మరి కొన్ని చోట్ల స్లిప్‌లను అందజేస్తున్నారు. స్లిప్‌లలో పేర్కొన్న విధంగా నేతలు మద్యం తీసుకొచ్చి పంపిణీ చేస్తున్నారు. ఈ మేరకు ముందస్తుగానే బార్‌లలో అభ్యర్థులు మద్యం నిల్వ చేసు కున్నారు. ఇలా ముందస్తు చర్యలు తీసుకోని నియోజక వర్గాల్లో వార్డుల వారీగా ఒక్కొక్కరికి రూ.200 చొప్పున నగదు అందచేస్తున్నారు. మద్యంతో పాటు మంసా హార భోజనం కూడా పంపిణీ చేస్తున్నారు. మందుబాబులకు పోలింగ్ వరకు ఎటువంటి ఇబ్బంది లేకుండానే మద్యం డోర్ డెలివరీ జరుగుతుంది. పోలింగ్ రోజు వరకు మద్యం పంపిణీ జరిగేలా ఎక్కడికక్కడ ఏర్పాట్లు జరిగాయి.

నేడు మాచర్లకు చంద్రబాబు

లోపలి పేజీలో..

- మధ్యాహ్నం కళామందిరం సెంటర్‌లో ప్రజాగళం సభ

బీసీలు టీడీపీ కుటుంబ సభ్యులే..


సమావేశంలో మాట్లాడుతున్న పెమ్మసాని చంద్రశేఖర్

- గుంటూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని
- యాదవ సంఘీయులతో ఆత్మీయ సమావేశం

తెనాలి రూరల్, మే 9: వైసీపీ ప్రభుత్వంలో బీసీలను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయ పరంగా ఎదగనివ్వకుండా ఓటు బ్యాంకుగా వాడుకున్నారని కూటమి ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆరోపించారు. గురువారం పట్టణంలోని ఎన్వీఆర్ కల్యాణమండపంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లతో కలిసి యాదవ సంఘీయులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ బీసీలు తొలినుండి తెలుగుదేశం పార్టీ కుటుంబసభ్యులేనన్నారు. పార్టీని ఎన్టీఆర్ స్థాపించింది మొదలు పూర్తిగా నడిపించే బాధ్యత తీసుకుంది కూడా బీసీ సామాజిక వర్గం వారేనని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు బీసీ సోదరలకు, సోదరీమణులకు అనేక వాగ్దానాలు చేసిందని తీరా అధికారంలోకి వచ్చిన తరువాత వాటన్నింటిని మరిచి పాలన సాగించిందని విమర్శించారు. టీడీపీ హయాంలో బీసీల అభ్యున్నతికి ప్రవేశపెట్టిన అనేక పథకాలను నిర్వీర్యం చేసి వారిని సామాజికంగా ఆర్థికంగా దెబ్బతీసేలా పాలన చేసిందని ఆక్షేపించారు. నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ నియోజవర్గంలో బీసీలలో పేదలందరికీ నివేసన స్థలాలు, పక్కా ఇల్లు కట్టించేలా ప్రణాళికా బద్ధంగా అమలు చేస్తామన్నారు. బీసీల ఆర్థికంగా బలపరిచేలా కూటమి ప్రభుత్వం పాలన ఉండనుందని తెలిపారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ బీసీలందరికీ రక్షణ చట్టంతో పాటు వారి అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం పాటుబడనుందన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమి ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్‌ను సైకిల్ గుర్తుపై, ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న నాదెండ్ల మనోహర్‌ను గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించాలని ఆలపాటి విజ్ఞప్తి చేశారు. ఇటీవల కాలంలో మృతి చెందిన మాజీమార్కెట్ యార్డు ఛైర్మన్ టీడీపీ సీనియర్ నాయకులు దివంగత గడవర్తి సుబ్బయ్యను స్మరించుకుంటూ ఆయనకు నివాళులర్పించి 5 నిముషాలు మౌనం పాటించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో న్యాయవాది తాడిబోయిన శ్రీనివాసరరావు, నిమ్మకాయల రమ్య, పెద్దసంఖ్యలో యాదవ సంఘీయులు, ఉమ్మడి పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


గడవర్తి సుబ్బయ్య మృతికి నివాళులర్పిస్తున్న పెమ్మసాని, నాదెండ్ల, ఆలపాటి తదితరులు

అరాచక పాలనను అంతం చేద్దాం


కురగల్లు రచ్చబండలో ప్రసంగిస్తున్న నారా భువనేశ్వరి

- నారా భువనేశ్వరి
- లోకేశ్‌తో పాటు ఎన్నికల ప్రచారం

మంగళగిరి, మే 9: రాష్ట్రంలో ఇకమీదట ఎవ్వరూ భయపడుతూ బతకరాదని.. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో హాయిగా జీవించే రోజులు రావాలంటే మే 13న ప్రతి ఓటరూ కూటమి అభ్యర్థులకే ఓటేసి గెలిపించాలని టీడీపి అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళగిరి నియోజకవర్గం కురగల్లులో గురువారం రాత్రి తనయుడు లోకేశ్‌తో కలిసి ఆమె ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపి అధినేత చంద్రబాబును 53 రోజులపాటు జైలులో పెట్టినపుడు మహిళలంతా తనకు అండగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. వారి స్ఫూర్తితోనే తాను రాష్ట్రవ్యాపితంగా నిజం గెలవాలి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించగలిగానన్నారు. గత అయిదేళ్లుగా రాష్ట్రంలో అరాచక ప్రభుత్వం ప్రజలను ఎన్నో రకాలుగా ఇబ్బందులకు అవస్థలకు గురిచేసిందన్నారు. భారత రాజ్యాంగం ప్రజలకు ప్రసాదించిన స్వేచ్ఛ, స్వాతంత్రాలను జగన్ పూర్తిగా హరించివేసిందన్నారు. అందుకే స్వేచ్ఛ స్వాతంత్రాలకోసం ప్రజలు ఈ అరాచక ప్రభుత్వాన్ని మే 13న సాగనంపాలని విజ్ఞప్తి చేశారు. గత అయిదేళ్లుగా ఎంతోమంది టీడీపి కార్యకర్తలు తమ జీవితాలను త్యాగం చేసి ప్రాణాలను పణంగా పెట్టి అరాచక ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడారన్నారు. అటువంటి కార్యకర్తలను తామెన్నటికీ మర్చిపోలేమన్నారు. వారందరినీ రాబోయే రోజుల్లో కన్నబిడ్డల్లా చూసుకుంటామన్నారు. ముఖ్యమంత్రి అంటే కేవలం బటన్ నొక్కడమే కాదు.. కష్టాల్లో వున్న ప్రజలను ఆదుకోవాలన్నారు. రాష్ట్ర విభజన తరువాత ప్రజలు కష్టాల్లో వున్నపుడు చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని నిలబెట్టేందుకు అహర్నిశలు శ్రమించారని గుర్తుచేశారు. ఇప్పటి పరిస్థితుల్లో కుటుంబానికి తండ్రిమాదిరి రాష్ట్రాన్ని ముందుకు నడిపించే నాయకుడు కావాలని, ఆ సమర్ధత చంద్రబాబుకు మాత్రమే ఉందన్నారు. మే 13న జరుగనున్న పోలింగ్‌లో మంగళగిరి నుంచి పోటీ చేస్తున్న లోకేశ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని భువనేశ్వరి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

కూటమి ప్రభుత్వంతోనే ముస్లింలకు భద్రత

- చేబ్రోలులో పెమ్మసాని శ్రీరత్న, ధూళిపాళ్ళ వైదీప్తి రోడ్ షో

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), మే9: ముస్లిం మైనార్టీలకు కూటమి ప్రభుత్వంలోనే భద్రతా ఉంటుందని పెమ్మసాని శ్రీ రత్న, ధూళిపాళ్ళ నాగసాయి వైదీప్తి అన్నారు. గురువారం చేబ్రోలులో గుంటూరు అభ్యర్థి సతీమణి పెమ్మసాని శ్రీ రత్న, ఎమ్మెల్యే అభ్యర్థి కుమార్తె ధూళిపాళ్ళ నాగసాయి వైదీప్తి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో రోడ్ షో నిర్వహించారు. శ్రీరత్న మాట్లాడుతూ పొన్నూరు ప్రాంతంలో ధూళిపాళ్ళ కుటుంబం ప్రజా సేవలో దశాబ్దాల తరబడి కొనసాగుతున్నారన్నారు. వీరయ్య చౌదరి హయాంలో నుంచి నరేంద్ర కుమార్ వరకు పొన్నూరును టీడీపీకి అడ్డాగా మార్చారారన్నారు. సంగం డెయిరీ ద్వారా పాల రైతుల ఆదాయాన్ని పెంచటమే కాకుండా ఎందరో ఉపాధి కల్పిస్తున్నారన్నారు. పొన్నూరు ప్రాంత అభివృద్ధికే జీవితాలు అర్పించారన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ప్రజలో అపోహలు సృష్టించేందుకు వేధింపులకు పాల్పడిందని ఆరోపించారు.వైదీప్తి మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లుగా ముస్లింలకు భద్రతా లేకుండా పోయిందన్నారు. గెలవనున్న కూటమి ప్రభుత్వంలో తిరిగి అన్ని పథకాలను ముస్లింలకు అమలులోకి తేనున్నట్లు చెప్పారు. ప్రజలకు అందుబాటులో అండగా ఉండే పెమ్మసాని చంద్రశేఖర్‌ను, ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేసారు. కార్యక్రమంలో కూటమి శ్రేణులు పాల్గొన్నారు.


చేబ్రోలులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న శ్రీరత్న, వైదీప్తి


మిల్లులో దాచిన మద్యం బాటిల్‌లను స్వాధీనం చేసుకున్న ఎస్ఐ షామీర్‌బాషా

వైసీపీ నేత మిల్లులో మద్యం స్వాధీనం

రాజుపాలెం, సత్తెనపల్లి, మే9: మండలంలోని కోటనెమలిపురి గ్రామ బస్టాండ్ సెంటర్లోని మిల్లులో అక్రమంగా దాచివుంచిన 359 మద్యం బాటిళ్లను గురువారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో వైసీపీ నేతలకు, కార్యకర్తలకు అందజేసేందుకు తీసుకువచ్చి వైసీపీ నేత దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డికి చెందిన మిల్లులో దాచి ఉంచారని ఓవ్యక్తి అధికారులకు సమాచారం అందజేశారు. దీంతో ఎస్ఐ షామీర్‌బాషా ఎన్నికల అధికారి శేఖర్‌బాబు ఆధ్వర్యంలో మిల్లులో తనిఖీలు నిర్వహించి మొత్తం 359 మద్యం బాటిళ్లలను స్వాధీనం చేసుకున్నారు. వీటివిలువ రూ46,350 ఉంటుందన్నారు.

297 మద్యం బాటిళ్ళు స్వాధీనం

సత్తెనపల్లి పట్టణంలోని విక్టర్ బారు వెనుక నుంచి మూడు గోతాల్లో తీసుకువెళ్తున్న 297మద్యం బాటిళ్ళను సెబ్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ షరీఫ్‌లు బుధవారం రాత్రి దాడిచేసి పట్టుకున్నారు. నాగన్నకుంటకు చెందిన ఎం. మహేష్, కాకుమాను హృదయరాజులు మూడు గోతాల్లో మద్యం తీసుకొని వెళ్తున్నారనే సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నామన్నారు. మద్యాన్ని స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసులు నమోదు చేసిన్నట్లు సీఐ తెలిపారు.

తనిఖీల్లో నగదు సీజ్

గుంటూరు(తూర్పు),మే9: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యం లో గురువారం ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా గుంటూరు తూర్పు, పశ్చిమ, మంగళగిరినియోజకవర్గాల్లో వరుసగా రూ.2,96,500, రూ.42,500, రూ.87,500 నగదు, తాడికొండ నియోజకవర్గంలో రూ.35,000 వస్తువులను సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో మే 9వ తేది సాయంత్రం 6 గంటల వరకు జరిగిన తనిఖీల్లో రూ.3,64,11,311 విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- వైసీపీకి చెందిన డబ్బు తరలిండగా ఘటన?


కారసాని వెంకట్ (ఫైల్)

యడ్లపాడు, మే 9: రోడ్డు ప్రమాదానికి గురై యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని చెంఘిజ్‌ఖాన్‌పేట గ్రామ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. గుంటూరులోని పెద పలకలూరుకు చెందిన కారసాని శ్రీనివాసరావు కుమారుడు కారసాని వెంకట్(32) గత పదిరోజులుగా యడ్లపాడు మండలంలో వైసీపీకి మద్దతుగా తన్నీరు సీతారామయ్య కుమారుడు తన్నీరు రాజేష్‌తో కలసి పనిచేస్తున్నాడని తెలిసింది. ఈ నేపథ్యంలో ఓటర్లకు నగదు పంపిణీ చేసేందుకు ద్విచక్రవాహనంపై కొండవీడు గ్రామంవైపు ద్విచక్రవాహనంపై బయలుదేరినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు వారిని వెంబడించడంతో ద్విచక్రవాహనాన్ని అతి వేగంతో పోనిచ్చారు. దీనితో బున్నినగర్, చెంఘిజ్‌ఖాన్‌పేట గ్రామాల మధ్య ద్విచక్రవాహనం అదుపుతప్పి మార్జిన్‌లో పార్కుచేసి ఉన్న మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొని ఇరువురూ పడిపోయారు. ఈ ఘటనలో వెంకట్ అక్కడికక్కడే చనిపోగా, రాజేష్ తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అతనిని గుంటూరులోని ప్రైవేటు హాస్పటల్‌కు తరలించారు. కాగా ఇద్దరూ కలసి సుమారు రూ.1.80 కోట్లు కొండవీడు మార్గంలోని గ్రామాలలోని ఓటర్లకు పంచేందుకు తరలిస్తున్నట్లు సమాచారం. అయితే పోలీసులు మాత్రం ఎలాంటి నగదును తరలించడం లేదని, అతి వేగం కారణంగానే ప్రమాదం జరిగిందని చెప్పడం విశేషం. కాగా పోలీసులు ఆ మొత్తాన్ని పక్కకు మళ్ళించినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి.

రేపటి నుంచి మిర్చి యార్డుకు సెలవులు

గుంటూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శనివారం నుంచి వేసవి సెలవులు ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నెలలోనే ఎండలు ముదరడంతో యార్డులో కార్మికులు పని చేయడం చాలా కష్టంగా మారింది. అయినప్పటికీ ఎప్పటిలానే మే రెండో వారం వరకు యార్డులో లావాదేవీలను కొనసాగించారు. కాగా శుక్రవారం ఉదయం 6 గంటలవరకు మాత్రమే యార్డులోనికి సరుకుని అనుమతిస్తారు. వాటివరకే ట్రేడింగ్ జరుపుతారు. అనంతరం మిగిలిపోయిన టిక్కీలను రైతులు శీతలగిడ్డంగులకు తరలించుకో వాల్సి ఉంటుంది. తిరిగి జూన్ 10వ తేదీన యార్డు గేట్లు తెరుచుకొంటాయి.



ఆర్టీసీ బస్సులో ప్లకార్డు ప్రదర్శిస్తున్న కలెక్టర్ శివ శంకర్

ఆర్టీసీ బస్సులో కలెక్టర్

- ప్రయాణికులకు ఓటు హక్కుపై అవగాహన..

నరసరావుపేట, మే 9 : నరసరావుపేట ఆర్టీసీ బస్టాండ్‌లో జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి శివశంకర్ లోతేటి డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందికి స్వీప్ యాక్టివిటీ, ఓటు హక్కుపై గురువారం అవగాహన కల్పించారు. అనంతరం ఆయన సత్తెనపల్లి పల్లెవెలుగు బస్సులో ప్రయాణించారు.ప్లకార్డులు ప్రదర్శించి, ప్రయాణికులతో ముచ్చటించి ఓటు హక్కు పై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

ఎన్నికల సిబ్బందికి ప్రత్యేక మెను

పిడుగురాళ్ల, మే9: ఇప్పటివరకు జరిగిన అన్ని ఎన్నికల్లో పోలింగ్ ప్రక్రియకు వచ్చిన సిబ్బందికి ఆయా గ్రామాలలో పట్టణాలలో ఇరుపార్టీల నేతలు భోజన, టిఫిన్ సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవడం తెలిసిందే. ఈఎన్నికల్లో అలాంటివి ఏమీ లేకుండా ఎన్నికల కమిషన్ బుధవారం ఓ జీఓ జారీచేసింది. అదేమిటంటే ఈ నెల 13న జరుగనున్న ఎన్నికల ప్రక్రియకు కేటాయించిన పోలింగ్ సిబ్బంది భోజన సదుపాయాల కోసం ఏ రాజకీయపార్టీ నేతలను ఆశ్రయించకుండా తగిన నిధులు విడుదల చేయడంతో పాటు ఎన్నికల సిబ్బందికి 12వతేదీ రాత్రి భోజనం, 13వతేదీ ఉదయం అల్పాహారం, భోజనం, సాయంత్రం స్నాక్స్, కొబ్బరిబొండా, జ్యూస్ లాంటివి ఏర్పాటు చేసుకోవాలని మెను కూడా ప్రకటించింది. ఎన్నికలకు ముందు రోజు 12వ తేదీ సాయంత్రం టిఫిన్, రాత్రికి భోజనంలో చపాతి, రైస్, ఆకుకూర పప్పు, రోటీ పచ్చడి, టమాట ఆలు కర్రీ, పెరుగు, రసం, అరటిపండు, మరునాడు ఉదయం 3 ఇడ్లీ, రెండు గారె, 9 గంటలకు జ్యూస్, 11 గంటలకు స్నాక్స్, 12.30 గంటలకు వెజిటబుల్ బిర్యాని, 3 గంటలకు బిస్కెట్స్, టీ, సాయంత్రం 6 గంటలకు అల్పాహారంతో మెను ఏర్పాటు చేసింది.


బ్రహ్మారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన రమేష్ తదితరులు

టీడీపీలో చేరిన వైసీపీ సర్పంచ్

- సాదరంగా ఆహ్వానించిన జూలకంటి బ్రహ్మారెడ్డి

దుర్గి, మే9: మండలంలోని గజాపురంకు చెందిన వైసీపీ సర్పంచ్ జక్కా రమేష్ ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. మండల కేంద్రమైన వెల్దుర్తిలో కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి సమక్షంలో గురువారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. రమేష్‌తోపాటు మరో 20 కుటుంబాల వారికి పార్టీ కండువా కప్పి బ్రహ్మారెడ్డి సాదరంగా ఆహ్వానించారు. రమేష్ మాట్లాడుతూ. వైసీపీ బలోపేతానికి ఎంతో కృషి చేసినప్పటికీ చివరికి తమకు నిందలు, అవమానాలే మిగిలాయని, అందుకే ఆ పార్టీలో ఇమడలేక టీడీపీలో చేరామని అన్నారు.

నేడు చంద్రబాబు పర్యటన

మాచర్లటౌన్,మే9: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రబాబునాయుడు శుక్రవారం మాచర్ల పట్టణానికి విచ్చేయనున్నారని జూలకంటి బ్రహ్మారెడ్డి గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మధ్యాహ్నం 3గంటలకు కళామందిరంసెంటర్లో బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగిస్తారన్నారు. నియోజకవర్గ పరిధిలోని మాచర్ల, వెల్దుర్తి, కారంపూడి, దుర్గి, రెంటచింతల మండలాల నుంచి కూటమి నేతలు తరలిరావాలని పిలుపునిచ్చారు.


వీరాపురంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న డాక్టర్ మేఘన తదితరులు

శ్రీకృష్ణదేవరాయలు గెలుపు

పల్నాడు అభివృద్ధికి మలుపు

- ఎంపీ అభ్యర్థి లావు సతీమణి మేఘన

పిడుగురాళ్ల: పల్నాడు ప్రాంతం అభివృద్ధి, రైతులకు సాగునీరు పుష్కలంగా అందాలన్నా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతోనే సాధ్యమవుతుందని నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు సతీమణి డాక్టర్ మేఘన తెలిపారు. గురువారం పిడుగురాళ్ల మండలం వీరాపురం, దాచేపల్లి మండలంలోని ఇరికేపల్లి గ్రామంలో మహిళలు, పార్టీశ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మేఘన మాట్లాడుతూ పల్నాడు ప్రాంతమంటేనే రైతులు అధికంగా వుండే ప్రాంతమని, రెండు పంటలకు సాగునీరు అందించేందుకు మేజర్, మైనర్ కాల్వల మరమ్మతులు పూర్తి చేసే లక్ష్యంతో టీడీపీ పనిచేస్తుందన్నారు. రైతులకు వెన్నుదన్నుగా వుండే టీడీపీని గెలిపించేందుకు ఎంపి అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలుకు, గురజాల అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావుకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వున్నం నాగమల్లిఖార్జునరావుతో పాటు పలువురు నాయకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


వేల్పూరులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఐజీ అజిత్‌సింగ్

ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా చూడాలి

- డీఐజీ డాక్టర్ అజిత్‌సింగ్

వేల్పూరు(శావల్యాపురం)మే 9: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని పల్నాడు జిల్లా ఎన్నికల పోలీసు పరిశీలకులు, డీఐజీ డాక్టర్ అజిత్‌సింగ్ సిబ్బందిని ఆదేశించారు. శావల్యాపురం మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో ఒకటైన వేల్పూరులోని పోలింగ్ కేంద్రాలను ఆయన గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల భవనాలు, పోలింగ్ బూత్ నెంబర్‌లు, మౌలిక వసతులు, పరిసరాలను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు అందజేశారు. వినుకొండ నియోజకవర్గంలోని సమస్యాత్మక గ్రామాలు, ఆయా గ్రామాలలో గతంలో ఎన్నికలు జరిగిన తీరు, సీసీ కెమేరాల ఏర్పాటు తదితర అంశాలను గురించి వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్‌రావును ఆరా తీశారు. వారితో పాటు ఎస్ఐ చల్లా సురేష్, కానిస్టేబుళ్లు ఉన్నారు.

వైసీపీ ప్రచారంలో వలంటీర్

బాపట్ల, మే 9 : పట్టణంలోని భీమావారిపాలెం సచివాలయం పరిధిలో గురువారం నిర్వహించిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో ఓ మహిళా వలంటీరు పాల్గొన్నారని టీడీపీ నాయకులు ఆరోపించారు. దీనిపై మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఆమెపై చర్యలు తీసుకోలేదని, తక్షణమే ఆ వలంటీరుని విధులనుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.


భీమావారిపాలెంలో వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్

అర్ధరాత్రి ప్రచారం

- నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ ఎన్నికల ప్రచారం
- తుమ్మకోటలో అర్ధరాత్రి ఒంటి గంట దాకా..
- వైసీపీకి అనుకూలంగా నిలిచిన ఎస్ఐ నారాయణరెడ్డి

మాచర్లటౌన్, మే 9: మాచర్ల నియోజకవర్గంలో వైసీపీ ఎన్నికల ప్రచారం ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా సాగుతోంది. బుధవారం నియోజకవర్గంలోని మాచర్ల మండలం కొత్తపల్లి, ద్వారకాపురి, లచ్చంబావి, అచమ్మకుంట, సుబ్బారెడ్డిపాలెం, బెల్లంకొండవారిపాలెం, నాగులవరం, తాళ్లపల్లి, భైరవునిపాడులతోపాటు రెంటచింతల మండలం తుమ్మకోటలో వైసీపీ నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అయితే ఎన్నికల నిబంధనల ప్రచారం ప్రచారం రాత్రి 10 గంటలకు ముగించాల్సి ఉంది. నిబంధనలకు విరుద్ధంగా ఒకే రోజు మరిన్ని గ్రామాలు ప్రచారాలు పెట్టుకొని తుమ్మకోటలో రాత్రి 11 గంటల తరువాత ప్రచారం ప్రారంభించి అర్ధరాత్రి ఒంటిగంట దాకా కొనసాగించారు. ప్రచారంలో బాణాసంచా, డప్పులు, డీజేలు ఉపయోగించడంతో గ్రామ ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఇదంతా రెంటచింతల ఎస్ఐ కేవీ నారాయణరెడ్డి ఆధ్వర్యాన జరగడం విశేషం. మద్యం సేవించిన యువకులు బైకుల సైలెన్సర్లు పీకేసి భారీ శబ్దాలతో రౌండ్లు కొట్టడం చేశారు. టీడీపీ ప్రచారం జరుగుతుంటే రాత్రి 10 గంటలకు పది నిమిషాల ముందే ఆపాలని హుకుం జారీ చేసే సదరు ఎస్ఐ వైసీపీ ప్రచారం విషయంలో పూర్తిగా వైసీపీకి సహకరించడం విమర్శలకు దారితీస్తోంది. తుమ్మకోట గ్రామంలో బైకులపై టీడీపీకి సంబంధించి చంద్రబాబు స్టిక్కర్లు ఉంటే స్టిక్కర్లు తొలగిస్తూ యువతతో ఘర్షణ పడ్డారు ఎస్ఐ నారాయణరెడ్డి. అదే వైసీపీకి సంబంధించి జగన్‌మోహన్‌రెడ్డి స్టిక్కర్లు ఉంటే వాటిని తొలగించకుండానే చూసీచూడనట్టు వెళ్లిపోయారు. ప్రచారంలో నరసరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పోట్ల ముత్తయ్య, పి సంపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు చేశాం: ఆర్వో శ్యాంప్రసాద్

తుమ్మకోటలో అర్ధరాత్రి వరకు జరిగిన వైసీపీ ప్రచారంపై సీవీజీ యాప్ ద్వారా ఫిర్యాదు అందిందని, సమయం ముగిసినప్పటికీ ప్రచారం జరగడంతో కేసు నమోదు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్ అన్నారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అబద్ధాల పాలనకు చెల్లు చీటి

- 1604వ రోజుకు రైతుల ఆందోళనలు


వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్లూరు, మే9: అమరావతే రాష్ట్ర రాజధాని అని, అధికారంలోకి వచ్చిన తరువత బ్రహ్మాండంగా కడతామని చెప్పిన సీఎం జగన్‌రెడ్డి మూడు రాజధానులని ప్రజలను మోసం చేశాడని రాజధాని అమరావతికి 33వేల ఎకరాల భూములు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, మహిళలు, రైతు కూలీలు చేస్తున్న ఆందోళనలు గురువారం నాటికి 1604వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాలు ఇళ్ల వద్ద నుంచి వారు మట్లాడుతూ, ఐదేళ్ల అబద్ధాలతో వైసీపీ సర్కార్ పాలన గడిచిందన్నారు. నిజమైన అభివృద్ధి జరిగే పాలన రాబోతుందన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాల్లో నిరసనలు, ఆందోళనలు కొనసాగుతున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 • నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	152, 161,172
చికెన్ విత్ స్కిన్	292.00
చికెన్ స్కిన్ లెస్	302.00

69,876 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 55,964 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 69,876 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 28,712 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8500	17800
నెంబరు. 5	9000	15000
273	9500	13000
341	9000	14000
4884	8500	12000
సూపర్ 10	15600	17000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20500
బ్యాడిగి	8500	15500
దేవనూరు డీలక్స్	9000	16000
తెల్లకాయలు	5000	11000

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

గెలుస్తాం.. ప్రజా పాలన అందిస్తాం

● యరపతినేని శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ జంగా

● గ్రామాలలో ప్రజల నుండి అపూర్వ ఆదరణ.. స్వాగతం

మాచవరం, మే 9: ఈ ఎన్నికల్లో తాము తప్పక గెలుస్తామని, ప్రజా పాలనను అందిస్తామని గురజాల నియోజకవర్గ కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తిలు ధీమా వ్యక్తం చేశారు. గురువారం మాచవరం మండలంలోని గంగిరెడ్డిపాలెం, మాచవరం, తురకపాలెం, కొత్తపాలెం, వేమవరం, చెన్నాయపాలెం, రేగులగడ్డ గ్రామాలలో వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజల నుండి వీరికి అపూర్వ స్వాగతం లభించింది. ఈ సందర్భంగా యరపతినేని మాట్లాడుతూ 2014-19 మధ్యలో నియోజక వర్గంలో వందల కోట్ల రూపాయలతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఒక్క మాచవరం గ్రామంలోనే రూ.50 కోట్ల నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు పూర్తిచేశామన్నారు. కృష్ణానదినుండి పలు గ్రామాలకు లిఫ్ట్ ఇరిగేషన్‌ల ద్వారా సాగు, తాగునీరు అందించి తీరుతామని స్పష్టం చేశారు. పలుకులాల వారు కమ్యూనిటీ హాల్స్ నిర్మించాలంటూ విజ్ఞాపన పత్రాలు అందజేశారని, వారి కోరికలను తప్పకుండా నెరవేరుస్తామ న్నారు. ఇళ్లస్థలాలు లేని ప్రతిఒక్కరికి 2 సెంట్లు స్థలంతో పాటు ఇల్లు కట్టించి తీరుతామన్నారు. ఐదు సంవత్సరాల అరాచక పాలనకు మూడు రోజుల్లో అంతం పలకాలని పిలుపునిచ్చారు. ఈ మూడు రోజులు అన్ని గ్రామాల్లోని కూటమి పార్టీల కార్యకర్తలు, నాయకులు ఐక్యంగా ఉంటూ ప్రజలు సైకిల్‌గుర్తుపై ఓటువేసేలా ముమ్మర ప్రయత్నాలు చేయాలని కోరారు. ఎమ్మెల్సీ జంగా మాట్లాడుతూ.. గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఈఐదేళ్లలో ఎంతో అహంకారంతో ఉంటూ, అక్రమార్జనే ధ్యేయంగా పనిచేశాడని ఆరోపించాడు. రానున్న ఎన్నికలలో కాసు మహేష్ రెడ్డిని చిత్తుగా ఓడించాలని, యరపతినేని శ్రీనివాసరావును, లావు శ్రీకృష్ణదేవరాయలను అఖండ మెజారిటీతో గెలిపించాల్సిందిగా పిలుపు నిచ్చారు. యరపతినేని శ్రీనివాసరావు, నేను కలిసి గురజాల నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ అధ్యక్షులు కటకం అంకారావు, మండల టీడీపీ అధ్యక్షులు బడిగుంచల వెంకటేశ్వర్లు, మండల జనసేన పార్టీ అధ్యక్షులు బొమ్మిశెట్టి శ్రీనివాస రావు, ఆయా గ్రామాల టీడీపీ, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో మాట్లాడుతున్న యరపతినేని, పక్కన ఎమ్మెల్సీ జంగా



యరపతినేనికి బొట్టుపెట్టి హారతులు ఇస్తున్న మహిళలు



ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

నేడు పిడుగురాళ్లలో భారీ ర్యాలీ

పిడుగురాళ్ల: పార్టీ క్యాడర్‌లో మరింత జోష్ పెంచేందుకు శుక్రవారం సాయంత్రం పిడుగురాళ్లలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు గురజాల నియోజకవర్గ కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తితో కలిసి ఆయన వివిధ గ్రామాలలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సార్వత్రిక ఎన్నికల ప్రచార కార్యక్రమాలు ముగుస్తున్న తరుణంలో ఫినిషింగ్ టచ్‌గా నియోజకవర్గంలోని కూటమి నేతలు, క్యాడర్, ప్రజలతో కలసి పిడుగురాళ్లలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలోని టీడీపీ, కూటమి శ్రేణులు ఈ ర్యాలీలో వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని యరపతినేని పిలుపునిచ్చారు.

టీడీపీలో చేరికలు.. గురజాల మండలం పల్లెగుంతకు చెందిన ఓసీ, బీసీ సామాజికవర్గాలకు చెందిన 15 కుటుంబాలు, పిడుగురాళ్ల పట్టణం 32,33వార్డుల్లోని 30 కుటుంబాలు, ఆదర్శనగర్‌లో వివిధ సామాజికవర్గాలకు చెందిన 15 కుటుంబాలు, గుత్తికొండ గ్రామంలోని బీసీ సామాజిక వర్గానికి చెందిన పలు కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారందరికీ యరపతినేని శ్రీనివాసరావు పార్టీలోకి ఆహ్వానించారు.

విధ్వంసం కాదు.. అభివృద్ధి కావాలి

● ఎన్నికల ప్రచారంలో భాష్యం ప్రవీణ్

● గ్రామ గ్రామాన మేళతాళాలతో స్వాగతం పలికిన ప్రజలు

క్రోసూరు, మే 9: రాష్ట్రానికి, ప్రజలకు కావాల్సింది సంక్షేమం, అభివృద్ధేతప్ప, విధ్వంసం, వినాశనం కాదని, వైసీపీ ఐదేళ్ల పాలనలో సీఎంగా జగన్‌రెడ్డి తన విధ్వంసకరా పాలనతో, అన్ని వ్యవస్థలను నాశనం చేశాడని, దీంతో ప్రజల జీవితాలు అతలాకుతలమయ్యాయని పెదకూరపాడు నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ విమర్శించారు. గురువారం రాత్రి క్రోసూరు మండలం నాగవరంలో ఎన్నికల ప్రచారం నిర్వ హించారు. ఈసందర్భంగా గ్రామంలో ఆయనకు అపూర్వ స్వాగతం లభించింది. గ్రామస్థులు మేళ తాళాలతో, మంగళ హారతులతో అడుగడుగునా అయనకు నీరాజనాలు పలికారు. ప్రత్యేక వాహనంపై నుంచి రోడ్‌షో నిర్వహిస్తూ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రం అభివృద్ధి సాధించాలన్నా యువతీ యువకులకు, రైతులకు, నిరుద్యోగులకు భవిష్యత్ ఉండాలన్నా మళ్ళీ చంద్రబాబు సీఎం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని భాష్యం ప్రవీణ్ అన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని మూడు దశాబ్దాల వెనుకబాటుతనానికి సీఎంజగన్ తీసుకువెళ్లారని మండిప డ్డారు. తనను గెలిపిస్తే పెదకూరపాడు నియోజక వర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని అన్నారు. సూపర్6 పథకాల గురించి మాట్లాడుతూ అధికారం లోకి రాగానే యువతకు 20 లక్షల ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, నెలకు రూ.3వేలు నిరుద్యోగభృతి, స్కూల్‌కు వెళ్ళే ప్రతి విద్యార్థికి సంవత్సరానికి రూ.15 వేలు, వ్యవసాయం చేసే ప్రతి రైతుకు సంవత్సరానికి రూ.20 వేలు, ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఆర్థిక సాయంతోపాటు ప్రతి ఇంటికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామన్నారు. వృద్ధులకు ఇంటివద్దకే రూ.4వేలు పింఛన్ ఇస్తామన్నారు. 13వ తేది జరిగే ఎన్నికల్లో సైకిల్‌గుర్తుపై ఓటువేసి తనను, శ్రీకృష్ణ దేవరాయలును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నాగవరంలో ప్రజలకు అభివాదం తెలుపుతున్న భాష్యం ప్రవీణ్



నాగవరంలో మహిళల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న భాష్యం ప్రవీణ్

కూటమి అభ్యర్థులను గెలిపించండి ...

పెదకూరపాడు : పెదకూరపాడు ఎమ్మెల్యే అభ్యర్థి భాష్యం ప్రవీణ్, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలను సైకిల్ గుర్తు పై ఓట్లు వేసి గెలిపించాలని జీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ ఎన్‌వీవీఎస్ వర ప్రసాదు కోరారు. పెదకూరపాడులో గురువారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ఉమ్మడి మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరిస్తూ ప్రచారాన్ని నిర్వహించారు.

మహిళా అభ్యున్నతే టీడీపీ ధ్యేయం

● కూటమి మేనిఫెస్టోలో మహిళా సంక్షేమానికి పెద్ద పీట

● భాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య

● పెదకూరపాడులో భారీగా 'మహిళా భేరీ రోడ్‌షో'

పెదకూరపాడు, మే 9: టీడీపీ ఆవిర్భావం నుంచి మహిళా అభ్యున్నతే లక్ష్యంగా ఆనాడు ఎన్‌టీఆర్, ఈనాడు చంద్రబాబు పెద్ద పీట వేస్తున్నా రని పెదకూరపాడు నియోజకవర్గ కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య అన్నారు. నియోజక వర్గ కేంద్ర మైన పెదకూరపాడులో గురువారం రాత్రి 'మహిళా భేరీ రోడ్ షో'ను నిర్వహించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్ర బాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే ప్రతి కుటుంబంలో 19 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల మధ్య ఉన్న ప్రతి మహిళకు నెలకు రూ.1500, బస్సుల్లో ఉచిత ప్రయాణం, పొదుపు సంఘాలకు రూ.10 లక్షల వడ్డీలేని రుణం వంటి సంక్షేమక పథకాలు అందుతాయన్నారు. ఎంపీ అభ్యర్థి లావుశ్రీకృష్ణదేవరాయలు సోదరి రుద్రమదేవి మాట్లాడుతూ పల్నాడు అభివృద్ధికి శ్రీ కృష్ణ దేవరాయలు నిస్వార్థంగా సేవలందించారని, గుంటూరులో పోటీచేయమన్నా పోటీ చేయకుండా పల్నాడు అభివృద్ధి కోసం పార్టీమారి ఎంపీగా పోటీ చేస్తున్నారని అన్నారు. రాజధాని ఉద్యమ నేత రాయపాటి శైలజ మట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పారిపోవటానికి సిద్ధంగా ఉన్నా రని, ఓటు మనబాధ్యత, ఓటుమన ఆయుధం ఆ ఓటు ద్వారా వైసీపీకి బుద్ధి చెప్పాలన్నారు.

ఈ నారీ భేరీలో వేలాది సంఖ్యలో మహిళలు పాల్గొనగా తొలుత ఎద్దల బండిపై భాష్యం లావణ్య ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అనంతరం ట్రాక్టర్‌లో నాగమల్లేశ్వర స్వామి దేవాలయం, కచేరి సెంటర్, పాత బస్టాండ్, అంబేద్కర్ సెంటర్, మహాలక్ష్మమ్మ సెంటర్, సాయి బాబా గుడి మీదుగా టీడీపీ కార్యాలయం వరకు రోడ్ షో సాగింది. కార్యక్రమంలో ఎంవీవీఎస్ వరప్రసాదు, అర్తిమళ్ళ రమేష్, భాష్యం ఆంజనేయులు, ఏటుకూరి రత్నకుమార్, వడ్లమూడి అప్పారావు, జిల్లా నేతలు వేగుంట రాణి, షేక్ ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.





ర్యాలీలో భాష్యం లావణ్య, రుద్రమదేవి తదతరులు

అరాచకం తప్ప అభివృద్ధి లేదు..

● ఎన్నికల ప్రచారంలో యరపతినేని సతీమణి నాగమణి

దాచేపల్లి, మే 9: గత వైసీపీ పాలనలో హత్యలు, దాడులు, పోలీసు కేసులు వంటి అరాచకాలతో పరిపాలన సాగిందే కానీ అభివృద్ధి జాడ అనేది లేదని గురజాల కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు సతీమణి నాగమణి తెలిపారు. గురువారం మండలంలోని రామాపురం, శ్రీనగర్ గ్రామాల్లో ఆమె పర్యటించారు. రామాపురం గ్రామంలో మహిళలపై కేసులు పెట్టి జైలుకు పంపించడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. పిడుగురాళ్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వేముల వినోద్‌రెడ్డి నాయకత్వంలో గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్తూ తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు.



రామాపురం గ్రామంలో పర్యటిస్తున్న యరపతినేని నాగమణి తదితరులు

'అన్నా.. మాకు మీ డబ్బులొద్దు ..'

● ఉద్యోగుల ఓట్ల కొనుగోలుకు ఫలించని వైసీపీ యత్నం

పిడుగురాళ్ల, మే 9: గురజాల నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ వేసే ప్రభుత్వ ఉద్యోగుల ఓట్లను కొనుగోలు చేసేందుకు వైసీపీ నేతలు చేసిన ప్రయత్నిం బెడిసికొట్టింది. గురజాల ప్రభుత్వ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రలో ఈనెల 5 నుండి ప్రారంభమైన ప్రభుత్వ ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓట్లను కొనుగోలు చేసేందుకు ప్రధాన పార్టీలు విశ్వప్రయత్నంచేశాయి. ఉద్యోగులకు డబ్బును ఆశగా చూపారు. అయితే కొందరు ఉద్యోగుల వద్దకు వెళ్లిన అధికార పార్టీ నాయకులకు ఎదురు దెబ్బ తగిలింది. 'అన్నా.. ఈ ఒక్కసారి మమ్మల్ని వదిలేయి.. మాకు మీ డబ్బులు వద్దు.. మా భవిష్యత్తును కాపాడుకునే నిర్ణయం తీసుకోవాలనుకుంటున్నాం' అని అధికార పార్టీ నేతలు ఇస్తున్న ఆఫర్‌ను కొందరు ప్రభుత్వ ఉద్యోగులు సున్నితంగా తిరస్కరించినట్లు సమాచారం.

పోలీస్ స్టేషన్‌లకు తాత్కాలిక ఇన్‌చార్జిల నియామకం

మాచర్ల రూరల్, మే 9: మాచర్ల నియోజకవర్గంలోని మాచర్ల పట్టణ సీఐ శరత్‌బాబు, కారంపూడి సీఐ చినమల్లయ్య, వెల్దుర్తి ఎస్ఐ శ్రీహరిలను ఎన్నికల కమిషన్ బుధవారం బదిలీ చేయడంతో వారు రిలీవయ్యారు. గురువారం పట్టణ సీఐ బాధ్యతలను తాత్కాలికంగా ఎస్ఐ బత్తుల గోపాల్, కారంపూడి సీఐ బాధ్యతలను నారాయణస్వామి, వెల్దుర్తి ఇన్‌చార్జి ఎస్ఐగా మోహన్ బాధ్యతలు స్వీకరించారు.

గుట్టుగా.. జోరుగా.. పందేలు ?

పిడుగురాళ్ల, మే 9: గురజాల నియోజకవర్గంలో గెలుపు ఎవరిదనే దానిపై గుట్టుగా జోరుగా పందేలు కాస్తున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో 115 సీట్లకు తక్కువ కాకుండా టీడీపీ కూటమి గెలుచుకోబోతుందని, అలాగే గురజాలలో యరపతినేని శ్రీనివాసరావు గెలుపు ఖాయమని కొందరు రూపాయికి రూపాయి చొప్పున పందేలు కాస్తున్నట్లు సమాచారం. గతవారం వరకు సుమారు 2,3 కోట్ల రూపాయల మేర పందాలు జరిగినట్లు తెలుస్తుంది. గురజాలలో యరపతినేని గెలుపొందుతాడని రూపాయికి రూపాయిన్నర చొప్పున పందాలు కాసేందుకు బయటి ప్రాంతానికి చెందినవారు పిడుగురాళ్లకు వస్తున్నట్లు సమాచారం.

సొంత గూటికి బొల్లినేని

మాచర్లటౌన్: వైసీపీ నియోజకవర్గ యువజన అధ్యక్షుడు బొల్లినేని లచ్చయ్య చౌదరి, యరపతినేని రామారావులు గురువారం ఆపార్టీని జూలకంటి బ్రహ్మారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా లచ్చయ్య చౌదరి మాట్లాడుతూ తిరిగి సొంత పార్టీలో చేరడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మంచికల్లుకు చెందిన టీడీపీ సీనియర్ నేత గోగుల సీతారామిరెడ్డి, మోసిన్ తదితరులు పాల్గొన్నారు.

కొసరు ఇచ్చి అసలుకి ఎసరుపెట్టిన జగనే

● సంక్షేమ పథకాల మాటున కోట్లు దోచుకున్నాడు

● అవినీతి, అరాచక ప్రభుత్వాన్ని చిత్తుగా ఓడించండి

● సత్తెనపల్లి కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

● లావు సోదరితో కలసి ముమ్మరంగా ఎన్నికల ప్రచారం..

సత్తెనపల్లి / సత్తెనపల్లి రూరల్, మే 9 : రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల అమలు తీరు 'కొసరు ఇచ్చి.. అసలుకు ఎసరు పెట్టిన చందం'గా ఉందని సత్తెనపల్లి నియోజకవర్గ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఆరోపించారు. గురువారం సత్తెనపల్లి మండలంలోని కంటెపూడి, నందిగామ, ఫణిదం గ్రామాల్లో నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీ కృష్ణ దేవరాయలు సోదరి రాణి రుద్రమదేవితో కలసి కన్నా లక్ష్మీనారాయణ ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో ఇంటింట ప్రచారం నిర్వహించిన కన్నా మరోమారు రాణి రుద్రమదేవి, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలతో కలసి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారానికి గ్రామ గ్రామాన టీడీపీ, జనసేన, బీజేపీ పతాకాలతో నాయకులు ఎదురేగి ఘనంగా స్వాగతం పలుకుతున్నారు. ఈ సందర్భగా కన్నా మాట్లాడుతూ.. ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలోని ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. వృద్ధులకు, వితంతువులకు, దివ్యాంగులకు ఇవ్వాల్సిన డబ్బులు కాంట్రాక్టర్లకు దోచి పెట్టిన ఘనుడు జగన్‌మోహన్‌రెడ్డి అని ఆరోపించారు. నవరత్నాల పేరిట మోస పూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన జగన్ తొలి ఏడాది నుంచి సంక్షేమ పథకాలకు కోతలు విధించారని, ఇప్పుడు విద్యా దీవెన, ఆసరా, చేయూత వంటి పథకాలకు మంగళం పాడారన్నారు. రాష్ట్రాన్ని అన్ని రకాలుగా వైఎస్ జగన్ నాశనం చేశారన్నారు. అవినీతి, అరాచక, దుర్మార్గపు ప్రభుత్వాన్ని అంత మొందించాలని పిలుపు నిచ్చారు. రానున్న ఎన్నికల్లో సైకిల్‌గుర్తుపై ఓట్లువేసి తనను, నరసరావు పేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీ కృష్ణ దేవరాయలను గెలిపించాలన్నారు.

రాణి రుద్రమదేవి మాట్లాడుతూ జగన్‌ను రాష్ట్రం నుంచి తరిమి కొట్టి మంచి పాలనను తెచ్చుకొనేందుకు కూటమిని గెలిపించాలన్నారు. రాష్ట్ర భవిష్యత్ బాగుండాలంటే కూటమి అధికారంలోకి రావాలని, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. సైకిల్‌గుర్తుపై ఓటువేసి లావు శ్రీ కృష్ణ దేవరాయలను, కన్నాను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు పిలుపు నిచ్చారు. కార్యక్రమాల్లో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, ఆళ్ళ అమరేశ్వరరావు, ఆళ్ళ సాంబయ్య, నందిగామ, కంటెపూడి, ఫణిదం గ్రామాల టీడీపీ, జనసేన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కంటెపూడి గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న కన్నా, రాణి రుద్రమదేవి, గాదె



నందిగామ ప్రచారంలో కన్నా, రాణి రుద్రమదేవి తదితరులు

కన్నాను, లావును గెలిపించాలి

నకరికల్లు : టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు అందరూ సమన్వయంతో పనిచేసి సత్తెనపల్లిలో కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణను, నరసరావుపేట ఎంపీగా లావు శ్రీకృష్ణ దేవరాయలను గెలిపించాలని కన్నా ఫణీంద్ర కోరారు. గురువారం ఆయన నకరికల్లులోని టీడీపీ కార్యాలయంలో పార్టీనేతలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మొక్కపాటి రామచంద్రరరావు, డాక్టర్ సింగరాజు సాయికృష్ణ, అట్లూరి పుల్లమ్మ, అట్లూరి శాంతి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరికలు.. గురువారం కుంకలగుంటకు చెందిన చేజర్ల వెంకటేశ్వర్లు, దమ్మవళం వెంకయ్య, కోన రామాంజనేయులు తదితరులు డాక్టర్ సింగరాజు సాయికృష్ణ ఆధ్వర్యంలో కన్నా సమక్షంలో టీడీపీలో చేరారు. అలాగే నకరికల్లు శివారు ఉదయనగర్ తండాకు చెందిన మణికల అల్లూరయ్య, శివకృష్ణలు టీడీపీలో చేరారు. ఆయా కార్యక్రమాల్లో ఆవుల సుబ్బయ్య, చేజర్ల రాజేంద్ర ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

విజనరీ నేత చంద్రబాబు

బెల్లంకొండ, మే 9 : టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు విజనరీ నేతని టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం మండల కేంద్ర మైన బెల్లంకొండలో ఎన్నిల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే చంద్రబాబు సీఎం కావాలన్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్ట లేదని విమర్శించారు. పెదకూరపాడు ఎమ్మెల్యేగా బాష్యం ప్రవీణ్‌ను ఎన్నుకుంటే ఎంతో మంచి జరుగుతుం దన్నారు. అనంతరం బెల్లంకొండ మెయిన్‌సెంటర్‌లో ప్రచారం నిర్వహిస్తూ చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన ఆరు సంక్షేమ పథకాలను వివరించారు. ఈనెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో లావు శ్రీ కృష్ణ దేవరాయలను, భాష్యం ప్రవీణ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతి సముద్రం, సలాం, సుభానీ, సయ్యద్ జానీ, ఇబ్రహీం, గంగారావు, సయ్యద్ జబ్బార్, సయ్యద్ మజీద్, చిట్టి, పెద్ద హయూం, వెంకటేష్, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వలంటీర్లు

దాచేపల్లి, మే 9: దాచేపల్లిలో 1వ వార్డుకు చెందిన వలంటీర్లు రాజీనామా చేసి టీడీపీలో చేరారు. గురువారం దాచేపల్లికి చెందిన వలంటీర్లు బండ్ల రాజేష్, బండ్ల బాబు, బండ్ల జీవరత్నం, బండ్ల విజయమ్మలు రాజీనామా చేసి స్థానిక టీడీపీ కార్యాయలంలో టీడీపీ మండల కన్వీనర్ బెల్లంకొండ భద్రి, మాజీ ఎంపీపీ అంబటి శేషగిరిరావు, బాలయ్య, నాగేశ్వరరావు, బొజ్జా అంజి మేస్త్రి, మాజీ సర్పంచ్ వలి, 5వ వార్డు కౌన్సిలర్ బొమ్మనబోయిన నాగరాజుల సమక్షంలో టీడీపీలో చేరారు.



టీడీపీలో చేరిన వలంటీర్లుతో పార్టీ నేతలు



గుండ్లకమ్మ నది పై నిర్మించిన వంతెన



చేజర్లలో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్పీ జీ బిందు మాధవ్

గొడవలు పడి కేసుల్లో ఇరుక్కోవద్దు

- సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక భద్రత
- కుంకలగుంట, చేజర్లలో ఎస్పీ బిందుమాధవ్ పర్యటన

నకరికల్లు, మే 9: ఐదేళ్లకు ఒక సారి వచ్చే ఎన్నికల కోసం స్థానికంగా కలిసి ఉండేవారు గొడవలు పడి ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టుకోవద్దని ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. మండలంలోని కుంకలగుంట, చేజర్ల గ్రామాల్లోని పోలింగ్‌కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. చేజర్లలో ప్రజలతో మాట్లాడారు. ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని గొడవలకు దిగి కేసుల్లో ఇరుక్కోవద్దనితెలిపారు. సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. గొడవలు కారణంగా ప్రజలే నష్ట పోతారన్నారు. ప్రతిచోట సీసీ కెమేరాలు ఏర్పాటుచేశామని, గొడవలకు పాల్పడిన వారి వివరాలు ఎప్పటికప్పుడు రికార్డు అవుతాయన్నారు. గొడవల సమాచారం 9440796184 నెంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ప్రజలు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. ఆయనతో పాటు స్పెషల్ బ్రాంచ్ సీఐ ప్రభాకర్, సీసీ కోటేశ్వరరావు, ఎస్ఐ పీ రాంబాబు తదితరులు ఉన్నారు.

2936 మంది.. హోం ఓటింగ్

- 98.47 శాతం ఓటింగ్ నమోదు



ఇంటి వద్దనే ఓటు వేస్తున్న వృద్ధురాలు

నరసరావుపేట, మే 9: వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దే ఓటు హక్కును వినియోగించుకొనే అవకాశాన్ని ఎన్నికల కమీషన్ కల్పించింది. ఈ మేరకు జిల్లాలో 2936 మంది హోం ఓటింగ్‌ను వినియోగించుకున్నారు. జిల్లాలో హోం ఓటింగ్‌కు 2,982 మంది ధరఖాస్తు చేసుకున్నారు. వీరి చేత ఓటు స్వీకరించేందుకు బుధ, గురువారాల్లో నిర్వహించిన ప్రక్రియలో సదరు ఓటర్లు ఓటు వేశారు. పెదకూరపాడు నియోజకవర్గంలో 388 మంది, చిలకలూరిపేటలో 371, నరసరావుపేటలో 509, సత్తెనపల్లిలో 490, వినుకొండలో 593, గురజాలలో 144, మాచర్ల నియోజకవర్గంలో 441 మంది ఓటు హక్కును ఇంటి వద్దనే వినియోగించుకున్నారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శివశంకర్ లోతేటి ఈ పోలింగ్ ప్రక్రియను పరిశీలిచారు.

ఓటెత్తిన ఉద్యోగులు

- రికార్డు స్థాయిలో ఓటింగ్ నమోదు
- జిల్లాలో పోస్టల్ బ్యాలెట్‌ల పోలింగ్ 95.18 శాతం

నరసరావుపేట, మే 9: జిల్లాలో ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను ఉత్సాహంగా వినియోగించుకున్నారు. గత ఎన్నికల్లో ఎన్నడూ లేనంతగా స్పందించారు. 95.18 పోస్టల్ బ్యాలెట్‌లు పోలయ్యాయి. నాలుగు రోజుల పాటు ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు ఓటింగ్ అవకాశం కల్పించగా వారంతా ఓటు వేసేందుకు ఆసక్తి కనబరిచారు. గత ఎన్నికను పరిశీలిస్తే ఉద్యోగులు ఓటు వేసేందుకు పెద్దగా ఆసక్తి చూపేవారు కాదు. 70 నుంచి 80 శాతానికి లోపే ఓటింగ్ నమోదయ్యేది. ఈ సారి దాదాపు ప్రతి ఉద్యోగి ఓటు వేసేందుకు కేంద్రాల వద్ద బారులు తీరారు.

జిల్లాలో 18,961 పోస్టల్ బ్యాలెట్‌ను జారీ చేశారు. అయితే నేరుగా పోలింగ్ కేంద్రాల వద్ద ఫారం 12ను అందజేసిన ఉద్యోగులకు కూడా పోస్టల్ బ్యాలెట్ జారీ చేశారు. ప్రభుత్వంపై ఉన్న కసితోనే ఉద్యోగులు తమ ఓటు వినియోగించేకున్నారన్న విపక్ష పార్టీలు అంచానా వేస్తున్నాయి. ఉద్యోగుల పట్ల ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించడం. వారికి ఇవ్వాల్సిన బెనిఫిట్స్‌ను ఇవ్వకపోవడం, మరీ ఉపాధ్యాయుల పట్ల కక్షసాధింపుగా వ్యవహరించడం, ప్రభుత్వం మద్యం దుఖానాల వద్ద వారికి డ్యూటీలు వేయడం వంటి చర్యలను సదరు వర్గం జీర్ణించేకోలేకపోయింది. ఉపాధ్యాయులు 80 శాతంకు పైగా వైసీపీకి వ్యతిరేకంగా ఓటు వేశారన్న ప్రచారం ఊపందుకుంది. మొత్తం మీద తమ ఓటు ద్వారా ఉద్యోగులు వైసీపీకి సరైన గుణపాఠం చెప్పారని జరుగుతున్న ప్రచారంకు నిజమో కాదో తేలాలంటే జూన్ 4 వరకు వేసి చూడాల్సిందే. తొలుత లెక్కించేది ఉద్యోగుల ఓట్లు. ఈ ఓట్లలో ఏ పార్టీకి మెజార్టీ వస్తే ఆ పార్టీ అధికారంలోకి వస్తుందనేది గత ఎన్నికల్లో నిరూపితమైంది. జిల్లాలో 18,086 ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారు. గురువారంతో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ జిల్లాలో ముగిసింది.

నియోజకవర్గాల వారీగా పోలైన ఓట్లు

నియోజకవర్గం	జారీచేసిన బ్యాలెట్‌లు	వినియోగించుకున్న ఉద్యోగులు	పోలింగ్ శాతం
పెదకూరపాడు	2387	2187	91.62
చిలకలూరిపేట	2567	2409	93.84
నరసరావుపేట	3569	3551	99.50
సత్తెనపల్లి	2477	2458	99.23
వినుకొండ	2683	2560	95.42
గురజాల	2526	2353	93.15
మాచర్ల	2752	2568	93.31
మొత్తం	18,961	18,086	95.39



ఓటు వేసేందుకు క్యూలో ఉన్న మహిళా ఉద్యోగులు

అభివృద్ధికి.. ప్రాధాన్యం

- నూజెండ్ల అభివృద్ధికి జీవీ బాటలు
- మండలంలోని గ్రామాల్లో పట్టణ స్థాయి సౌకర్యాల కల్పన
- తాగు నీరు, సాగు నీరు సమృద్ధిగా అందిస్తాం
- వినుకొండ నియోజక వర్గ ఎమ్మెల్యే కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు



వీ అప్పాపురం గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రెయిన్‌లు

నూజెండ్ల, మే 8: పది సంవత్సరాలు వినుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యేగా పనిచేసిన జీవీ ఆంజనేయులు నూజెండ్ల మండల అభివృద్ధికి బాటలు వేశారు. నేటికి గ్రామాల్లో టీడీపీ పాలనలో వేసిన సీసీ రోడ్లు, సీసీ డ్రెయినేజ్ వ్యవస్థ, సంపద సృష్టి కేంద్రాలు, పాఠశాల, పంచాయతీ, అంగన్ వాడీ భవనాలు అభివృద్ధికి సాక్షంగా నిలుస్తున్నాయి. శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రకృతి విపత్తులు, ప్రమాదాల్లో బాధితులైన వారికి అండగా నిలుస్తున్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వేలాది మంది అవ్వాతాలకు కంటి చూపు అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన లీడ్ ఇండియా కార్యక్రమాలు విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచాయి. ప్రభుత్వ పాఠశాల్లో చదివే విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి కళ్ళ జోళ్ళు శస్త్ర చికిత్సలు చేసి మందులు పంపిణీ చేసిన ఘనత శివశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు జీవీకి దక్కుతుంది. గత ప్రభుత్వంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన డాక్టర్ శ్యామ్ ప్రసాదు ముఖర్జీ రూరల్ అర్బన్ పథకం కింద నూజెండ్ల మండలాన్ని ఎంపిక చేయించి రూ.105 కోట్లు ప్రత్యేక నిధులు సమకూర్చి అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజ్‌లు నిర్మాణానికి కృషి చేశారు. నూజెండ్ల గ్రామానికి రూ.1.25 కోట్ల వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజ్ నిర్మాణాన్ని మంజూరు చేయించారు. నాగార్జున సాగర్ మోడర్నైజేషన్‌లో భాగంగా నూజెండ్ల మండలంలోని ఎన్ఎస్‌పీ కాలువలకు సిమెంట్ లైనింగ్‌లు, కాలువలను ఆధునికీకరించారు. అనంతపురం, అమరావతి రహదారి నిర్మాణంతో నూజెండ్లకు భాగ్యరేఖగా మారుతుందన్న భానవతో ఆరు లైన్‌ల రోడ్డు నిర్మాణానికి నూజెండ్లలో జంక్షన్ ఏర్పాటు చేయటం ద్వారా అభివృద్ధి పరుగులు తీయించేందుకు ముందు చూపుతో కృషి చేశారు. నియోజకవర్గంలో అధిక మొత్తంలో గృహ నిర్మాణాలు చేసిన ఘనత సాధించారు. గుండ్లకమ్మ నది పరివాహక ప్రాంతంలో లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల మంజూరు చేయించి రైతుల శ్రేయస్సు కోసం కృషి చేశారు.

మండలంలో ఎన్‌టీఆర్ భరోసా పథకం ద్వారా ఐదు సంవత్సరాల్లో 6008 మందికి ప్రతి నెల రూ.1,25,68,000 పంపిణీ చేశారు. రుణమాఫీ ద్వారా 10,587 మంది రైతులకు రూ.54.87 కోట్లు రుణమాఫీ జరిగింది. పసుపు కుంకుమ ద్వారా 1055 డ్వాక్రా గ్రూపుల్లోని 10,490 మంది సభ్యులకు రూ.21.10 కోట్లు పంపిణీ చేశారు. మండలంలో 833 సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి రూ.83.56 కోట్లు ఖర్చు చేశారు. 5204 మరుగు దొడ్ల నిర్మాణానికి రూ.7,54,44,000, ఎన్‌టీఆర్ గృహ నిర్మాణానికి రూ.20.52 కోట్లతో 1313 ఇళ్ళ మంజూరు చేయించారు. చంద్రన్న బీమా ద్వారా 197 క్లైమ్‌లకు రూ.3,01,65,000 చెల్లించారు. మండలంలోని 18 తారురోడ్ల నిర్మాణం, మరమ్మత్తులకు రూ.28.90 కోట్లు మంజూరు చేశారు. తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి రూ.90 లక్షల వ్యయంతో నిర్మాణ పనులను ప్రారంభించారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 306 మంది విద్యార్థులకు రూ.3,43,70,000, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా 42 మందికి రూ.64 లక్షలు, బీసీ కార్పొరేషన్ ద్వారా 227 మందికి రూ.2,37,2000, కాపు కార్పొరేషన్ ద్వారా 185 మందికి రూ.2,34,60,000 మంజూరు చేయించారు. ఎన్‌టీఆర్ జలసిరి పథకం ద్వారా రూ.4.97 కోట్ల వ్యయంతో 117 బోర్లు మంజూరు చేయించారు. ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ద్వారా 108 పనులకు గాను రూ.2,86,44,000, పండ్ల తోటల పెంపకానికి 496 మంది రైతులకు రూ.1,96,69,000 రాయితీ మంజూరు, ముఖ్యమంత్రి యువ నేస్తం ద్వారా 110 మంది నిరుద్యోగులకు ప్రతి నెల రెండు వేల రూపాయల పంపిణీ. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 595 మందికి రూ.1,99,2000 పంపిణీ చేశారు. రూ.1.04 కోట్ల వ్యయంతో నూజెండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యశాల నిర్మాణం, నూజెండ్ల - తంగిరాల తారు రోడ్డుకు రూ.9 కోట్లు, మందమంచిపాడు వీరాంజనేయ స్వామి దేవాలయం నుంచి గొల్లపాలెం వరకు రూ.3.50 కోట్ల వ్యయంతో బ్రిడ్జి, తారు రోడ్డు నిర్మాణం చేశారు.

ఈ ఎన్నికల్లో తనను ప్రజలు ఆశీర్వదించి గెలిపించటం ద్వారా నూజెండ్ల మండంలోని ప్రతి ఇంటికి వాటర్ గ్రిడ్ పథకం ద్వారా రక్షిత మంచి నీరు, పంట పొలాలకు కృష్ణా జలాలు అందని సమయంలో గోదావరి జలాలను సమృద్ధిగా అందించి గ్రామాల సమగ్ర అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని విజ్ఞప్తి చేశారు. ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థినైన జీవీ ఆంజనేయులు, ఎంపీ అభ్యర్థి లావు శ్రీ కృష్ణ దేవరాయలను గెలిపించే విధంగా సైకిల్ గుర్తుకు ఓట్లు వేసి మద్దతు తెలిపి రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు.



టీడీపీ ప్రభుత్వ పాలనలో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

కూటమి వైపు అడుగులు

- గెలుపు ఖాయం.. మెజారిటీయే లక్ష్యం
- భాష్యం ప్రవీణ్‌కు ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ



ఎన్నికల ప్రచారంలో అభివాదం చేస్తున్న భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, మే 9: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బాష్యం ప్రవీణ్ గెలుపే ఖాయంగా మెజారిటీయే లక్ష్యంగా వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం ప్రవీణ్‌కు ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వంపై విసిగి వేసారి పోయిన ప్రజలు ఆ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేందుకు సిద్ధమయ్యారని, ప్రజా విశ్వాసం చూస్తుంటే ఇట్టే అర్థం అవుతుంది. బాష్యం ప్రవీణ్ ప్రణాళికాబద్దంగా ముందుకు సాగుతున్న క్రమంలో వైసీపీ నుంచి ముఖ్యనేతలు కూటమి వైపు మొగ్గు చూపుతున్నారు. తనదైన శైలిలో ప్రచారాన్ని సమర్థంగా నిర్వహిస్తున్నారు. ఆయా కులాల వారీగా నియోజక వర్గంలో ప్రత్యేక సదస్సులు ఏర్పాటు చేసి ముఖ్యనేతలతో వైసీపీ ఐదేళ్ల పాలనలో తమ కులాలను అణిచివేసిన విధానాన్ని వివరిస్తూ ఓటర్లను చైతన్య వంతులను చేస్తున్నారు. కూటమి మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన సూపర్ - 6 పథకాలతో రాష్ట్ర ప్రజలకు మరింత సంక్షేమం రాబోయే రోజుల్లో వస్తుందని, రైతులకు, మహిళలకు, యువకులకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓబీసీల ప్రయోజనాల లక్ష్యంగా కూటమి మేనిఫెస్టోను రూపొందించిందన్నారు. పెదకూరపాడు నియోజక వర్గంలో టీడీపీ పాలనలో అన్ని అనుసంధాన గ్రామాలకు తారు రోడ్లు, గ్రామంలో అంతర్గత సిమెంట్ రోడ్లు నిర్మించుకున్న విషయాన్ని వివరించారు. మహిళలకు హారతులు పట్టి ప్రవీణ్‌కు స్వాగతం పలుకుతున్నారు. గత ఎన్నికల్లో పార్టీని వీడి పొరపాటు చేశామని, ఈ ఎన్నికల్లో టీడీపీలో చేరటం సొంత ఇంటికి వచ్చిన ఆనందంగా ఉందని పార్టీలో చేరిన పలువురు అంటున్నారు. ఈసారి టీడీపీ గెలుపుకు కృషి చేస్తామన్నారు. ఎటువంటి భేదాలు లేకుండా తాను మీకు అండగా ఉంటానని పార్టీలో చేరిన వారికి ప్రవీణ్ హామీ ఇస్తున్నారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీ అభ్యర్థిగా శ్రీ కృష్ణ దేవరాయలను గెలిపించాలని ఆయన కోరారు.



ప్రచారంలో ప్రవీణ్‌కు హారతి ఇస్తున్న మహిళలు



ఓట్లు అభ్యర్థిస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భాష్యం ప్రవీణ్

అన్ని వర్గాల.. ఆదరణ

- ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న అరవిందబాబు

నరసరావుపేట, మే 9: ఎన్నికల ప్రచారంలో ప్రజలు నరసరావుపేట అసెంబ్లీ స్థానం నుంచి బీసీ వర్గానికి చెందిన టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ అరవింద బాబుకు బ్రహ్మరథం పడుతున్నారు. చదలవాడను అన్ని వర్గాలు ఆదరిస్తున్నాయి. విజయమే లక్ష్యంగా ఎన్నికల క్షేత్రంలో అరవిందబాబు దూసుకుపోతున్నారు. ప్రజలు ఆయనకు నీరాజనాలు పలుకుతున్నారు. డాక్టర్ అరవిందబాబు ఓటర్లను ఉద్దేశించి మాట్లాడుతూ మహిళల చూపిస్తున్న ఆదరణ మరువలేనిదన్నారు. రాష్ట్రాభివృద్ధి చంద్రబాబు వలనే సాధ్యం అవుతుందన్నారు. కూటమి ప్రకటించిన మేనిఫెస్టో వలన అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతోందని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండూ ఒక్క కూటమి ప్రభుత్వం వల్లే సాధ్యమవుతుందని చెప్పారు. మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణం, మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా కూటమి ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఫించన్ రూ.4వేలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు 50 ఏళ్లకే పింఛన్ ఇవ్వనున్నట్టు వివరించారు. సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు వలన ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. అధ్వానంగా ఉన్న రహదారులకు మరమ్మతులు చేయిస్తాం. ఇంటింటికి తాగునీరు అందిస్తాం. గ్రామల్లో మురుగుకాలువల నిర్మాణం, పంట కాలువలను పునరుద్ధరిస్తాం. పట్టణంలో రెండు పూటలా తాగునీటి సరఫరా చేస్తాం. పరిశుభ్ర పట్టణంగా తీర్చిదిద్దుతాం. మునిసిపాల్టీ ద్వారా ప్రజలకు విస్తృత సేవలు అందించడం, చెత్త పన్ను రద్దు, పట్టణంలో విలీనమైన శివారు ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, ఆటోనగర్ ఏర్పాటు చేస్తానని అరవిందబాబు హామీలు ఇస్తున్నారు.

మత సామరస్యం కూటమితోనే సాధ్యం

కులం, మతం, ప్రాంతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు రేపే జగన్‌రెడ్డిని రాష్ట్రం నుంచి తరిమేందుకు సిద్ధం కావాలని చదలవాడ పిలుపునిచ్చారు. నరసరావుపేట పట్టణంలోని విజయ్‌కుమార్ కళ్యాణ మండపంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. అబ్దుల్ సలాం, మిస్బా, ఇబ్రహీం లాంటి మైనార్టీల ప్రాణాలు బలిగొన్న జగన్‌రెడ్డికి మైనార్టీలు ఓటేస్తే మైనార్టీల ప్రాణాలకు గ్యారెంటీ ఉంటుందా అని ప్రశ్నించారు. రంజాన్ తోఫా, దుకాన్ మకాన్, షాదీ ఖానాల నిర్మాణం, మసీదుల నిర్మాణానికి నిధుల కేటాయింపుతో చంద్రబాబు మైనార్టీలకు అండగా నిలిచారన్నారు. ఆ పథకాలన్నీ రద్దు చేసిన జగన్‌రెడ్డి మైనార్టీల ఓటు కోసం దిక్కుమాలిన రాజకీయాలకు పాల్పడుతున్నాడని ధ్వజమెత్తారు. ఢిల్లీలో కేంద్రానికి మద్దతిచ్చి, గల్లీలో కేంద్రాన్ని విమర్శించే జగన్ లాంటి అవకాశవాదుల్ని రాష్ట్రం నుంచి తరిమికొట్టినపుడే మైనార్టీలకు మేలు జరుగుతుందని చదలవాడ పేర్కొన్నారు. కార్యక్రమంలో కపలవాయి విజయకుమార్, చిన్నపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ కుటుంబాలు

నరసరావుపేట మండలం యలమంద గ్రామానికి చెందిన వైసీపీ కుటుంబాలు చదలవాడ అరవిందబాబు సమక్షంలో గురువారం తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తానని, అండగా నిలుస్తానని చదలవాడ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి సయ్యద్ జిలానీ, టీడీపీ నాయకులు మానుకొండ రామకృష్ణ, ఎర్రమసు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఇక్కుర్రు ఎన్నికల ప్రచారంలో మహిళలతో డాక్టర్ చదలవాడ అరవిందబాబు



యలమందలో అరవిందబాబు, జిలానీ సమక్షంలో పార్టీలో చేరిన వైసీపీ మహిళలు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

దళితుల సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తాం

● కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, మే 9: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాగానే దళితులకు జగన్‌రెడ్డి రద్దుచేసిన అన్ని సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తామని, 50 సంవత్సరాలకే పింఛను అందిస్తామని మాజీ మంత్రి, చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు హామీ ఇచ్చారు. గురువారం పట్టణంలోని ప్రత్తిపాటి గార్డెన్స్‌లో జరిగిన దళితుల ఆత్మీయ సమావేశంలో ప్రత్తిపాటితో పాటు ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలు తండ్రి లావు రత్తయ్య, టీడీపీ అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యాలరావులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ సీఎం జగన్‌రెడ్డి పాలనలో దళితులు, ఎస్టీలు, ముస్లిం మైనారిటీలు, బీసీలే ఎక్కువ నష్టపోయారని, జగన్‌రెడ్డి తీసుకున్న ప్రతి నిర్ణయం పేదవాడికి భారమైందని, 120కి పైగా సంక్షేమ పథకాలు రద్దు చేశారని, ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులు దారి మళ్ళించారని, చివరికి అంబేద్కర్ పేరిట ఉన్న విదేశీ విద్యా పథకానికి ఆయన పేరు తొలగించి జగన్‌రెడ్డి పేరు పెట్టుకున్నారన్నారు. అనంతరం టీడీపీ అధికార ప్రతినిధి మాణిక్యారావు మాట్లాడుతూ జగన్‌రెడ్డి దళితులను దగా చేశారని, భూమి కొనుగోలు పథకాన్ని రద్దు చేశారన్నారు. క్రిష్టియన్ మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మద్దిరాల మ్యానీ, వివిధ దళిత సంఘాల నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.



ప్రత్తిపాటి పుల్లారావుకు మద్దతు తెలుపుతున్న కేశన శంకరరావు, తదితరులు

రజకులకు దోబీ ఘాట్‌లు, విద్యుత్ చార్జీలో రాయితీలు

చిలకలూరిపేట అర్బన్, మే 9: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రజకులకు దోబీ ఘాట్‌ల నిర్మాణానికి ప్రోత్సాహకం, వారికి విద్యుత్ చార్జీల్లో రాయితీలు అందిస్తామని మాజీ మంత్రి, చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని రజక కమ్యూనిటీ హాల్‌లో జరిగిన రజకుల ఆత్మీయ సమావేశానికి కూటమి అభ్యర్థి ప్రత్తిపాటితో పాటు ఎంపీ అభ్యర్థి లావు శ్రీ కృష్ణ దేవరాయలు తండ్రి విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ రజకుల కోరిక మేరకు 50 సంవత్సరాలకే పెన్షన్ ఇవ్వాలని, ఇప్పటికే తమ అధినేత చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారని గుర్తుచేశారు. సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి శాసన సభకు తనను, పార్లమెంట్‌కు లావు శ్రీకృష్ణ దేవరాయలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

జాలాదిలో టీడీపీ నాయకుల విస్తృత ప్రచారం

జాలాది (యడ్లపాడు), మే 9: రాష్ట్రం అభివృద్ధి పథంలో నడిపించాలన్నా, యువతకు ఉద్యోగాలు రావాలన్నా, పేదల సంక్షేమం కొనసాగాలన్నా ఒక్క తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని మాజీ ఎంపీపీ, సీనియర్ టీడీపీ నాయకుడు కంది మళ్ళ రఘురామారావు పేర్కొన్నారు. మండలంలోని జాలాదిలో టీడీపీ నాయకులు గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాల గురించి అవగాహన కల్పించారు. సూపర్ సిక్స్ పథకాల బాండ్లను అందజేసి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు, ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షుడు పిన్నింటి శ్రీమన్నారాయణ, తెలుగు యువత నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్‌ను గద్దె దించేందుకు బీసీలంతా ఎదురు చూస్తున్నారు: కేశన

చిలకలూరిపేట, మే 9: రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిని గద్దెదించడానికి, వైసీపీని బంగాళాఖాతంలోకి విసిరేసేందుకు బీసీలంతా సిద్ధంగా ఉన్నారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు, మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు గురువారం చెప్పారు. బీసీలను నమ్మించి నిలువునా మోసంచేసిన జగన్‌రెడ్డికి బుద్ధి చెప్పడానికి మే13వ తేదీ కోసం ఎదురుచూస్తున్నారని వారు స్పష్టం చేశారు. చిలకలూరిపేటలో కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావును ఏపీ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశన శంకరరావు, ఆ సంఘం సభ్యులు కలిసి ఎన్నికలలో కూటమి విజయానికి కృషి చేస్తామని ప్రకటించారు. అయిదేళ్లుగా బీసీ, ఎస్సీలపై జరుగుతున్న దాడుల నియంత్రణ, యువత, రాష్ట్ర భవిష్యత్తు కోసం ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏకు మద్దతుగా ఉండాలని గుంటూరులో నిర్వహించిన ప్లీనరీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అందుకే రాష్ట్రమంతా పర్యటిస్తూ తెలుగుదేశం కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం కూడా నిర్వహిస్తున్నామన్నారు.

వెంకటకుమారి, శరత్ ప్రచారం

చిలకలూరిపేట, మే 9: ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలిపించాలని చిలకలూరిపేట టీడీపీ అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు సతీమణి వెంకటకుమారి గురువారం పట్టణంలోని 21, 22 వార్డుల్లో ప్రచారం చేశారు. స్థానికులు ఆమెకు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు ప్రత్తిపాటి శరత్ గురువారం రాత్రి చిలకలూరిపేట మండలం పసుమర్రు గ్రామంలో ఎన్నికల ప్రచారం చేశారు.

● నాదెండ్ల: మండలంలోని చందవరం గ్రామంలో శరత్ గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు బి.సత్యనారాయణ, ఎన్ వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాతపూడిలో రత్తయ్య, స్వాతి ప్రచారం

చిలకలూరిపేట, మే 9: చిలకలూరిపేట మండలం తాతపూడిలో టీడీపీ విజయాన్ని ఆకాంక్షిస్తూ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు తండ్రి లావు రత్తయ్య, అసెంబ్లీ అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు కుమార్తె డాక్టర్ స్వాతిలు ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం చేశారు.







చిలకలూరిపేటలో ప్రచారం చేస్తున్న ప్రత్తిపాటి సతీమణి వెంకట కుమారి, కుమారుడు, శరత్, కుమార్తె స్వాతి, లావు రత్తయ్య తదితరులు

జగన్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మే 9: అయిదేళ్లుగా ఉత్తుత్తి బటన్లు నొక్కి డబ్బులు మాత్రం ఇవ్వకుండా మోసం చేసిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి బుద్ధి చెప్పడానికి రాష్ట్ర ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని మాజీమంత్రి, చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు గురువారం అన్నారు. ఇటీవల వివిధ పథకాలకు సంబంధించి దాదాపు రూ.18వేల కోట్ల నిధులకు సంబంధించి బటన్లు నొక్కినా లబ్ధిదారులకు పైసా ఇవ్వకుండా జగన్ దొంగ డ్రామాలాడానరని దుయ్యబట్టారు. పథకాలకు ఇవ్వాల్సిన డబ్బులు సకాలంలో ఇవ్వకుండా కాలయాపన చేసి ఇప్పుడు ఈసీ నిబంధనల పేరిట ఆ డబ్బులు మొత్తానికి ఎగ్గొట్టేందుకే కథ నడిపిస్తున్నారని ధ్వజమెత్తారు. చిలకలూరిపేట సంజీవ్‌నగర్, సుగాలి కాలనీకి చెందిన 100 కుటుంబాలు కొత్త కృష్ణ, చేవూరి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో తెలుగుదేశంలో చేరాయి. 34, 35 వార్డుల నుంచి 5 కుటుంబాలు తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నాయి. 29వ వార్డు నుంచి షేక్ ఫిరోజ్, ఆయన కుటుంబసభ్యులు ఖాజా ఆధ్వర్యంలో తెలుగుదేశంలో చేరారు. నాదెండ్ల మండలం ఇర్లపాడు నుంచి మండల పార్టీ అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, గ్రామ నాయకుల ఆధ్వర్యంలో ఆరు కుటుంబాలు తెలుగుదేశంలో చేరాయి.

ప్రత్తిపాటికి పుడమి బిల్డర్స్ అధినేత సురేష్ మద్దతు

పుడమి బిల్డర్స్ అధినేత, యడ్లపాడు మండల ప్రముఖులు, సినీ, రంగస్థలం నటులు మాతవరపు సురేష్‌బాబు గురువారం కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావును చిలకలూరిపేటలోని ఆయన నివాసంలో కలిసి తన మద్దతును ప్రకటించారు. సురేష్ బాబుతో కలిసి ముత్తవరపు రామారావు, ఆలోకం పెద్దఅబ్బయ్య, కలసి తమ మద్దతును ప్రకటించారు.

● నాదెండ్ల, మే 9: మండలంలోని తూబాడు, నాదెండ్ల గ్రామాల్లో గురువారం రాత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జీడీసీసీబీ మాజీ చైర్మన్ మానం వెంకటేశ్వర్లు, సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, జనసేన సమన్వయ కర్త తోట రాజా రమేష్, నాయకులు నల్లమోతు హరిబాబు, దగ్గుమల్లి సాంబశివరావు, చెన్నుపాటి నాగేశ్వరరావు, షేక్ ఖాజావలి, జ్ఞానరెడ్డి, చిన్నపరెడ్డి, జనసేన నేతలు డీ శరత్, ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా

కూటమి ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలు



డాక్టర్ చదలవాడ సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ కుటుంబాలు

నరసరావుపేట టౌన్, మే 9: ప్రజలకు అందుబాటులో ఉంటానని కూటమి ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. గురువారం నరసరావుపేట పట్టణంలోని రావిపాడు రోడ్డులో ఉన్న టీడీపీ కార్యాలయంలో ముస్లిం పెద్దలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ అభివృద్ధి చేసే వ్యక్తిగా గుర్తించి, అందరికీ అందుబాటులో ఉండే తనకు అండగా ఉంటామంటూ ముస్లిం పెద్దలు అందరూ రావడం సంతోషకరమన్నారు. 2014 నుంచి 2019 వరకు తెలుగుదేశం పార్టీ ముస్లిలందరికీ దుల్హన్ పథకం, ఇమామ్‌లకు, మోజమ్‌లకి ఇచ్చిన వేతనాలు, మసీదుల మరమ్మతులకు నిధులు, కొత్త ఈద్గాలు నిర్మించడానికి ఇచ్చిన నిధులు ఏవిధంగా ఇచ్చారో వచ్చే ఐదు సంవత్సరాలలో కూడా దానికి కట్టుబడి ఉన్నామన్నారు. ఎంపీ లాడ్స్ వైపు నుంచి వచ్చే ఐదు సంవత్సరాలలో 50 షాదీఖానాలు నిర్మించే బాధ్యత తీసుకుంటానన్నారు. సమావేశంలో మహమ్మద్ హుస్సేన్, ముక్తిక్ అమురుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తదితరులు

ప్రాంతాల మధ్య జగన్‌రెడ్డి చిచ్చు: చదలవాడ

నరసరావుపేట టౌన్, మే 9: ఓటమి భయంతో కుల, మత, ప్రాంతాల మధ్య జగన్‌రెడ్డి చిచ్చు పెడుతున్నారని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. గురువారం పట్టణంలోని విజయ కల్యాణ మండపంలో ముస్లిం మైనారిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ కులం, మతం, ప్రాంతం పేరుతో ప్రజల మధ్య చిచ్చురేపే జగన్‌రెడ్డిని రాష్ట్రం నుంచి తరిమేందుకు సిద్ధంగా కావాలని పిలుపునిచ్చారు.

నరసరావుపేటలో వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరిక

నరసరావుపేట టౌన్, మే 9: నరసరావుపేట పట్టణంలోని 12వ వార్డులో 20 వైసీపీకి చెందిన కుటుంబాలు గురువారం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. జగన్‌మోహన్‌రెడ్డిని నమ్మి ఓటేస్తే నవయవంచనకు పాల్పడ్డారని మండిపడ్డారు. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ అన్యాయం, దగా, దుర్మార్గం అనేవి జగన్‌మోహన్‌రెడ్డి డీఎన్ఏలోనే ఉన్నాయని అన్నారు. ప్రతి ఒక్కరికి అభివృద్ధి అంటే ఏంటో చూపించేది కూటమి ప్రభుత్వమేనన్నారు. కార్యక్రమంలో బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్, నేలలూరి మురళి, చిన్నపరెడ్డి, శీలు బాబురావు, చల్లా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

97.37 శాతం రీ పోలింగ్

చిలకలూరిపేట, మే 9: చిలకలూరిపేటలో పోస్టల్ బ్యాలెట్ల రీపోలింగ్‌కు సంబంధించి 97.37 శాతం ఓటింగ్ నమోదైంది. మొత్తం 1219మంది ఓటు వేయాల్సి ఉండగా 1187మంది మాత్రమే ఓటింగ్‌లో పాల్గొన్నారు. మిగిలిన ఓటర్లు శుక్రవారం వచ్చి ఓటు వేయవచ్చని ఆర్వో తెలిపారు. ఇదిలాఉండగా హోమ్ ఓటింగ్‌కు మొత్తం 159మంది దరఖాస్తు చేయగా 154మంది ఇప్పటివరకు ఓటింగ్‌లో పాల్గొన్నారు. శుక్రవారం మిగిలిన నలుగురి గృహాల వద్దకు వెళ్ళి ఓటు వేసేలా చర్యలు చేపట్టినట్టు ఎన్నికల అధికారి నారదముని గురువారం తెలిపారు.

ఏడు ఆలయాల భూముల కౌలు హక్కుల వేలం

యడ్లపాడు, మే 9: మండలంలోని ఏడు దేవాలయాల భూముల కౌలు హక్కుల వేలంను గురువారం నిర్వహించారు. యడ్లపాడులోని శ్రీరాజరాజేశ్వర స్వామి, శ్రీరణవీరాంజనేయస్వామి, అద్దంకి నాంచారమ్మతల్లి, విశ్వేశ్వరస్వామి ఆలయాలకు చెందిన 28.53ఎకరాల భూములకు స్థానిక శ్రీరణవీరాంజనేయస్వామి దేవస్థానం ఆవరణలో కౌలు హక్కుల వేలం నిర్వహించారు. ఏడాది కాల పరిమితితో నిర్వహించిన ఈ వేలంలో స్థానిక రైతులు పాల్గొని రూ.3.08లక్షలకు కౌలు హక్కులను దక్కించుకున్నారు. గత ఏడాదికన్నా 10శాతం కౌలు అధికంగా వచ్చినట్లు దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి శివయ్య తెలిపారు.

అక్రమ మద్యం కేసులో నిందితుడికి రిమాండ్

నరసరావుపేట లీగల్, మే 9 : అక్రమ మద్యం కేసులో నిందితుడైన రొంపిచర్ల మండలం రెడ్డిపాలెం గ్రామానికి చెందిన కొండ్రాతి శ్రీనివాసరావుకు రిమాండ్ విధిస్తూ స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రవలిక గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 8న నిందితుడు వినుకొండ రోడ్డులోని ఓ రెస్టారెంట్ వద్ద 288 మద్యం సీసాలను కలిగి ఉండగా నరసరావుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ఆంజనేయులు (ఫైల్ ఫొటో)

వినుకొండ టౌన్, మే 9: టిప్పర్ ఢీకొని ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తి మృతిచెందిన ఘటన పట్టణంలోని వెల్లటూరు రోడ్డు కూడలి వద్ద గురువారం జరిగింది. వినుకొండ చెక్ పోస్టు సమీపంలో నివాసం ఉంటున్న ముండ్లపాటి ఆంజనేయులు (60) వ్యక్తిగత పనులపై కొండ్రముట్ల నుంచి వినుకొండ వస్తుండగా వెల్లటూరు రోడ్డు నుంచి పట్టణంలోకి ప్రవేశిస్తున్న ఇసుక టిప్పర్ తగిలింది. సుమారు 50అడుగుల దూరం టిప్పర్ ద్విచక్రవాహనంతోపాటు ఆంజనేయులును ఈడ్చుకెళ్ళింది. తీవ్రంగా గాయపడిన ఆంజనేయులును వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఆయన కొంతకాలంగా యర్రగొండపాలెం సమీపంలోని బోయపల్లి నుంచి వినుకొండకు వచ్చి టీపొడి అమ్ముతూ జీవనం సాగిస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య భ్రమరాంబ, ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు.

918 మద్యం సీసాలు స్వాధీనం

యడ్లపాడు, మే 9: యడ్లపాడు మండలం ఉన్నవ శివారులో అనధికారికంగా తరలిస్తున్న 918 మద్యం సీసాలను ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి తులసీదాస్ ఆధ్వర్యంలోని బృందం గురువారం స్వాధీనం చేసుకుంది. ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు ఆటోను, మద్యం సీసాలను స్టేషన్‌కు తరలించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి తులసీదాస్ ఫిర్యాదుమేరకు ఎస్‌ఐ శ్యామ్యూల్ రాజీవ్‌కుమార్ కేసు నమోదుచేసుకుని నిందితుడిని చిలకలూరిపేట కోర్టులో హాజరు పరిచారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని గేదె మృతి

వినుకొండ టౌన్, మే 9: గుంటూరు, కర్నూల్ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని గేదె మృతిచెందిన సంఘటన మండలంలోని చీకటీగల పాలెం సమీపంలో గురువారం జరిగింది. నూజండ్ల మండలం టి.అన్నవరం గ్రామానికి చెందిన బాలకోటయ్య గేదెగా స్థానికులు గుర్తించి వారికి సమాచారం అందించారు. మృతిచెందిన గేదె విలువ రూ.80వేలు ఉంటుందన్నారు.

జనసేన అభిమానులు సైకిల్ గుర్తుకు ఓటు వేయాలి

● ఇండిపెండెంట్ అభ్యర్థికి గాజు గ్లాస్‌గుర్తు కేటాయించారు

● జనసేన పార్టీ జిల్లా లీగల్‌సెల్ ప్రధాన కార్యదర్శి రమణారావు

వినుకొండ, మే 9: నియోజకవర్గంలో జనసేన పార్టీ పోటీచేయడం లేదని, ఎన్డీఏ కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులుకు మద్దతుగా తెలుగుదేశం పార్టీకి సైకిల్ గుర్తుపై ఓటువేసి అఖండమైన మెజార్టీతో గెలిపించాలని జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా లీగల్‌సెల్ ప్రధాన కార్యదర్శి నక్క రమణారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో జనసేన పార్టీ సింబల్ గాజు గ్లాసును ఇక్కడ స్వతంత్ర్య అభ్యర్థికి కేటాయించారని, జనసేన, టీడీపీ, బీజేపీ బలపర్చిన అభ్యర్థులు జీవీ ఆంజనేయులుతోపాటు, కృష్ణదేవరాయలుకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

జయహో బీసీతో బలహీనవర్గాల భవిష్యత్తుకు భరోసా: మద్దిరాల

శావల్యాపురం, మే 9: జయహో బీసీ కార్యక్రమం ద్వారా చంద్రబాబు బీసీ పేదలకు భవిష్యత్తుపై భరోసా కల్పిస్తున్నారని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్ అన్నారు. శావల్యాపురంలోని టీడీపీ కార్యాలయంలో బీసీ నాయకులతో కలసి గురువారం బీసీ డిక్లరేషన్‌ను ఆవిష్కరించారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం: జీవీ ఆంజనేయులు



తంగినీడుపాలెంలో జీవీ ఆంజనేయులుకు గజమాలతో స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

ఈపూరు, మే 9: రాష్ట్రాభివృద్ధి టీడీపీతోనే సాధ్యమౌతుందని ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని అగ్నిగుండాల, రంగాపురంతండాల్లో గురువారం పర్యటించారు. సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు నిశ్శంకరరావు, శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు బాలయ్య, వెంకట్రావు,సాంబయ్య వెంకటేశ్వరరెడ్డి, ముసలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గుంగుపల్లి తండావాసులకు పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి సాదరంగా ఆహ్వానిస్తున్న జీవీ ఆంజనేయులు

వెల్లటూరులో జీవీ ఆంజనేయులుకు బ్రహ్మరథం

బొల్లాపల్లి, మే 9: మండలంలోని సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు వెల్లటూరు, నాయుడుపాలెం, తంగినీడుపాలెం, సీతారమపురం తండా గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ముందుగా ఆయా గ్రామాల్లో మహిళలు భారీ సంఖ్యలో తరలివచ్చి హారతులు, పూలమాలలు ఘన స్వాగతం పలికారు. తంగినీడుపాలెంలో గజమాలతో స్వాగతం పలికారు. గంగుపల్లితండా నుంచి 25 కుటుంబాలు జీవీ ఆంజనేయులు సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన పార్టీ కో-ఆర్డినేటర్ నిశ్శంకర శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు జరపాల గోవింద నాయక్, పెమ్మసాని నాగేశ్వరరావు, బొడ్డపాటి మల్లికార్జునరావు, తిప్పి శెట్టి వెంకటేశ్వర్లు, హనుమానాయక్, యర్రంశెట్టి జయరావు, యరగాల బాదరయ్య, యర్ల శ్రీను, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొల్లా దుర్మార్గాలను ఓటుతో అడ్డుకోవాలి : జీవీ

ఈపూరు, మే 9: గ్రామాల్లో అరాచకాలు, దుర్మార్గాలు నశించాలంటే ఓటు అనే ఆయుధంతో బొల్లాబ్రహ్మనాయుడును ఇంటికి సాగనంపాలని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని ముప్పాళ్ళ గ్రామంలో ఈ నెల 7వ తేదీన మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు మోదుగుల నరసింహారావు కారుకు దుండగులు నిప్పుపెట్టారు. మంటల్లో కారు పూర్తిగా దగ్ధమైంది. గురువారం జీవీ గ్రామాన్ని సందర్శించి మంటల్లో కాలిపోయిన కారును పరిశీలించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో రాపర్ల జగ్గారావు, మో దుగుల నరసింహారావు, విడపలపాటి హనుమయ్య, పులుకూరి వెంకట్రావు, కంచేటి చంద్రరావు, తిరుమలశెట్టి బాలయ్య సూరే కోటేశ్వరరావు తదితరలున్నారు.

లీలావతికి హారతులతో ఘన స్వాగతం


వినుకొండటౌన్, మే 9: పట్టణంలోని 30వ వార్డు సంజీవ్‌గాంధీనగర్‌లో ఎన్డీఏ కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు సతీమణి గోనుగుంట్ల లీలావతి జీవీ ఆంజనేయులుతోపాటు ఎంపీ అభ్యర్థి కృష్ణదేవరాయలు విజయాన్ని కాంక్షిస్తూ గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులోని ముస్లిం మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆమెకు స్వాగతం పలికారు. శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ద్వారా మీరు చేస్తున్న సేవలు మరిచిపోలేనివని, గతంలో ఎం తో మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించి పేదల హృదయాల్లో వెలుగులు నింపారంటూ ఆమెను ప్రశంసించారు.

బ్రాహ్మణులకు సముచిత స్థానం కల్పిస్తాం: లీలావతి

వినుకొండ, మే 9: పట్టణంలోని అవ్వారు ఫంక్షన్ హాల్లో బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథులుగా జీవీ ఆంజనేయులు సతీమణి గోనుగుంట్ల లీలావతితోపాటు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే బ్రాహ్మణులకు సముచిత స్థానం కల్పిస్తామని, రాష్ట్రంలో బ్రాహ్మణులపై జరిగిన దాడులు పునరావృతం కాకుండా రక్షణ కల్పిస్తామన్నారు.

పెరుమాళ్లపల్లిలో ఎన్నికల ప్రచారం

వినుకొండటౌన్, మే 9: మండలంలోని పెరుమాళ్ళపల్లి గ్రామంలో ఎన్డీఏ కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు సతీమణి గోనుగుంట్ల లీలావతి పార్టీ సీనియర్ నాయకులతో కలిసి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలోభాగంగా ఇంటింటికి వెళ్ళి ప్రజల బాగోగులను తెలుసుకొని మ్యానిఫెస్టోలో కరపత్రాలను పంపిణీచేశారు.



వినుకొండ పట్టణంలోని సంజీవ్‌గాంధీనగర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న లీలావతి

దళితులను మోసగించిన జగన్‌ను చిత్తుగా ఓడించాలి

● ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలి ● మాజీ మంత్రి కొత్తపల్లి జవహర్

వినుకొండ, మే 9: వైసీపీ ఐదేళ్ల పాలనలో దళితులపై దాడులు జరిగాయని, ఇప్పటివరకు 2400 మందిపై దాడులు, హత్యలు, హత్యాచారాలు జరిగాయని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు కొత్తపల్లి జవహర్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దళిత ద్రోహి అని, వాళ్ళకి కావాల్సింది పదవులు, కుర్చీలే తప్ప దళిత ప్రాణాలకు ఎటువంటి రక్షణ లేదన్నారు. దళితులకు రక్షణ కావాలన్నా సంక్షేమ పథకాలు కావాలన్న రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలన్నారు. 2019 జగన్ గెలిచేందుకు తనతల్లి బైబిల్ పట్టుకొని రావడంతో దళితులందరు క్రైస్తవ బిడ్డలని నమ్మబలికారని, కాని ఆచరణలో బైబిల్ దొంగలని జగన్ అసలు క్రైస్తవుడే కాదన్నారు. కేవలం హిందువులను మోసగించేందుకు జగన్‌రెడ్డి స్వరూపనందస్వామి కాళ్లు పట్టుకున్నారన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే చర్చిలు కూలుస్తారని, పాస్టర్లపై దాడులు చేస్తారని చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. వైసీపీ నేతలు రాజకీయ స్వార్థం కోసమే కూటమిపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. దళితులను మోసంచేసే జగన్మోహన్ రెడ్డిని రాష్ట్రంలోని దళితులు నమ్మవద్దన్నారు. వర్గీకరణకు ఇప్పటికే మద్దతు ప్రకటించిందని, వర్గీకరణకు జగన్ వ్యతిరేకమని, వైసీపీని చిత్తుగా ఓడించాలన్నారు. ఈ నెల 13వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికల్లో అవినీతి పాలకుడైన బొల్లా బ్రహ్మనాయుడును ఓడించి మీ సేవకుడైన జీవీ ఆంజనేయులును అఖండ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఆయనతోపాటు నియోజకవర్గ పరిశీలకులు మానుకొండ శివప్రసాద్, నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ రాజశేఖర్, ఎనుముల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.